VISALAANDHRA VIJAYAWADA—Phone No 376

రిజిష్టర్డు నెం. 6097. 4 పేజీలు ఒక అణా

కర్నూలుకు ప్రకాశం పంతులుగారి రాక

కర్నూలు, సెప్టెంబరు 28

టంగటూరి ప్రకాశం పంతులుగారు మద్రాసునుంచి నేడిక్కడకు వచ్చారు. వెంటనే సంజీవరెడ్డిగారితో రాజభవనానికి వెళ్ళి గవర్నర్ త్రివేదీని సందర్శించారు. ఒకటి రెండు రోజులలో మంత్రివర్గ సభ్యుల నిర్ణయం అంతిమంగా జరుగుతుందని తెలుస్తున్నది.

మంత్రివర్గంలో 7 గురు సభ్యులేవుంటారని భావించబడుతున్నది. అయితే ఆఖరికి 9 మంది ఉండే అవకాశం లేకపోలేదనికూడా ఇక్కడ భావించబడుతున్నది (వి. వి.)

విశాలాంధ్ర

సంపుటి 2 ★ విజయవాడ : మంగళవారం; సెప్టెంబరు 29, 1953 ★ సంచిక 195

70543 2

ఆంధ్ర శాసనసభా కమ్యూనిస్టుపార్టీ ప్రథమసమావేశం

విజయవాడ, సెప్టెంబరు 28

ఆంధ్ర శాసనసభా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల ప్రథమ సమావేశం ఈ నెల 30వ తేదీన, కర్నూలులో జిల్లా కమ్యూనిస్టు కమిటీ ఆఫీసులో జరుగుతుంది. సాయంత్రం 3 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. కార్యనిర్వాహకవర్గం ఎన్నిక, పార్టీ విధానం చర్చించబడుతుంది.

విశాలాంధ్ర ఏర్పరచిననాడే ఆంధ్రజాతి సర్వతోముఖాభివృద్ధి

తెలంగాణా ఆంధ్రమహాసభ కన్వెన్షన్‌లో శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారి ఉద్ఘాటన

హైద్రాబాద్ రాష్ట్ర విభజన జరిగి తీరాలని స్పష్టీకరణ

["విశాలాంధ్ర" విలేఖరి]

హైద్రాబాద్, సెప్టెంబరు 27

"మొత్తం ఆంధ్రజాతినంతనూ ఏకంచేసిననాడే, విశాలాంధ్ర నేర్పరచిననాడే ఆంధ్రజాతి ఏకమై అభివృద్ధి పథాన పడుతుంది. అప్పుడే విజ్ఞానరంగంలో, ఆర్థికంగా అభివృద్ధి అవుతాం" అని నేడిక్కడ ప్రారంభమైన ఆంధ్రమహాసభ కన్వెన్షన్‌లో మహాసభాధ్యక్షులు శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారు హెచ్చరించారు.

నేడు ప్రతాపగిరిజీ కోఠీలో శ్రీ రావి నారాయణరెడ్డిగారి అధ్యక్షతన ఆంధ్రమహాసభ కన్వెన్షన్ ప్రారంభమయింది.

సభకు మూడువందలమందికి పైగా ప్రతినిధులు తెలంగాణా అన్ని జిల్లాల నుంచి వచ్చారు. ఆంధ్ర ప్రాంతంనుంచి ప్రత్యేకాహ్వానాలపై శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావు, వావిలాల గోపాలకృష్ణయ్యగార్లు సభకు హాజరయ్యారు.

డా. జయసూర్య, (పార్లమెంటు సభ్యులు) గోవిందదాస్ పాఫ్రి, (ప్ర. ట్. ప్రధాన కార్యదర్శి) మాజీ కాంగ్రెసు సభ్యుడు వర్రా మాధవరావు, ప్రజా సోషలిస్టు పార్టీకి చెందిన రామమూర్తి నాయుడు, కార్మిక నాయకులు రాజబహదూర్ గౌడ్, టి. బి. విఠల్‌రావు, అసెంబ్లీ ప్రతిపక్ష నాయకులు దేశ్‌పాండే, అవామ్ సంపాదకులు అఖ్తర్ హుసేన్, ఇతర ప్రముఖులు ప్రత్యేకాహ్వానాలపై సభనలంకరించారు.

పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, కమ్యూనిస్టు పార్టీ, పీపుల్సు డెమాక్రటిక్ ఫ్రంట్ కార్యకర్తలు, కూలీ, రైతు సంఘాల నాయకులు, స్వతంత్రులు అయిన ఆంధ్ర ప్రజా ప్రతినిధులు మూడు వందలమందికి పైగా సభలో పాల్గొన్నారు.

ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ కె. ఆర్. వీరాస్వామి, ఎమ్. ఎల్. ఏ. గారు ప్రతినిధులను ఆహ్వానిస్తూ ఉపన్యసించారు. (వీరి ఉపన్యాసం వేరొకచోట యిచ్చాము.)

తర్వాత అధ్యక్షులు శ్రీ రావి నారాయణరెడ్డిగారు ఆంధ్రమహాసభాధ్యక్షులయిన శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారిని సభకు ఎరుకపరచారు.

సభికుల జయ జయ ధ్వానాలమధ్య శ్రీ ఎల్లారెడ్డిగారు ఈవిధంగా ఉపన్యసించారు:

"అతి ప్రధానమయిన ఒక చారిత్రక ఘట్టంలో ఈకన్వెన్షన్ జరుపుతున్నాం. అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడబోతూంది. ఆంధ్ర ప్రజల త్యాగాల మూలకంగా రాష్ట్రం వచ్చింది. ఎంతోమంది ప్రాణత్యాగాల మూలకంగా, ముఖ్యంగా శ్రీ పొట్టి శ్రీరాములుగారి బలిదానం ఫలితంగా, ఆంధ్ర ప్రజల ఐక్యశక్తి ఫలితంగా ఆంధ్రరాష్ట్రం సాధించారు. త్యాగపురుషులను చూచి గర్వించటం అవసరం.

"ఈ రాష్ట్రం ఏర్పడడంతో ఆంధ్రజాతి అంతా ఏకంకాదు. జాతి అభివృద్ధికాదు. మొత్తం ఆంధ్రజాతినంతా ఏకంచేసిననాడే, విశాలాంధ్ర ఏర్పరచిననాడే ఆంధ్రజాతి ఏకమై అభివృద్ధి పథాన పడుతుంది. అప్పుడే విజ్ఞానరంగంలో, ఆర్థికంగా అభివృద్ధి అవుతాం. మనకున్న సాధనసంపత్తి విభజింపబడటంవల్ల ఆర్థికంగా బలపడలేం.

రాష్ట్రం ఏర్పడడంతో సమస్యలన్నీ పరిష్కారం కావు. ఇది ఒక మొదటి మెట్టు మాత్రమే. ఈ మొదటి మెట్టును సాధించినందుకు సంతోషించాలి.

ఆంధ్రమహాసభాధ్యక్షులు
శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారు

విశాలాంధ్ర ఏర్పడాలంటే హైద్రాబాద్ విచ్ఛిత్తికావాలి. ఇది జరగనంతకాలం విశాలాంధ్ర ఏర్పడదు. అందుకని విశాలాంధ్రకు రెండవ మెట్టు హైద్రాబాద్ విచ్ఛిత్తి కావడం. హైద్రాబాద్ సంస్థానం విశాలాంధ్రకు పెద్ద ఆటంకంగా తయారైంది. హైద్రాబాద్ విచ్ఛిత్తిచేసి ఐక్య మహారాష్ట్ర, ఐక్య కర్నాటక, విశాలాంధ్రలను నిర్మించాలని ఆంధ్రమహాసభ మొదటినుండీ కృషిచేసింది. జాతీయ చైతన్యం కలుగచేయటానికి ఆంధ్రమహాసభ పునాదులువేసింది. దీన్ని ప్రారంభించినది. పూజ్యులయిన శ్రీ మాడపాటి హనుమంతరావు గారు. వారు ఆంధ్రజన కేంద్రం పేరుతో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం సల్పారు. 1930 నుంచి వారు ఆంధ్ర మహాసభను పెంపొందించుతూ వచ్చారు.

ప్రజాసమస్యలపై పోరాటం

"ఆంధ్ర మహాసభ యితర సమస్యలను తీసుకొని, కృషిచేసి గొప్ప రాజకీయ, జాతీయ సంస్థగా తయారైంది. ఇవేగాక, తెలంగాణా ప్రజల ఆర్థిక సమస్యలు, సాంఘిక సమస్యలు కూడా తీసుకొని పనిచేసింది. క్రమంగా పెంపొందుతూ ఇక్కడ గొప్ప చరిత్రాత్మక భూమి పోరాటం నడిపింది. ఇది సుప్రసిద్ధమైన విషయం. ఇది నైజాంను గడగడలాడించి ప్రజల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళింది.

(మిగతా 2వ పేజీలో)

ఉత్తర కొరియాపై అమెరికా విమానాల గస్తీ

హాంకాంగు, సెప్టెంబరు 27

అమెరికన్ విమానాలు నూతనంగా ఉత్తరకొరియా భూభాగంపైన గస్తీ తిరిగాయనీ, ఉత్తర కొరియా, చైనా ప్రతినిధులు, యుద్ధ విరమణ మిలిటరీ కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తెచ్చారనీ, నవచైనా వార్తాసంస్థ తెల్పింది.

కర్నూలుకు త్రివేదీ ఆగమనం

కర్నూలు, సెప్టెంబరు 27

ఆంధ్రరాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన శ్రీ చందూలాల్ త్రివేదీ, సతి శ్రీమతి కుసుమ్ త్రివేదీ సమేతంగా నేటి ఉదయం 10-15 కు కర్నూలు చేరుకున్నారు.

త్రివేదీ ప్రభృతులు మద్రాసు నుంచి గుత్తివరకు రైలులోవచ్చి గుత్తి నుంచి కర్నూలుకు కారులో వచ్చారు. గుత్తిలో కర్నూలు స్పెషల్ కలెక్టర్ శ్రీ చల్లా నరసింహం, కర్నూలు జిల్లా కలెక్టర్ శ్రీ మాధవరావు, కర్నూలు జిల్లా పోలీసు సూపరింటెండెంటు మున్నగువారు వారికి స్వాగతమిచ్చి కర్నూలుకు తీసుకవెళ్ళారు.

కర్నూలులో త్రివేదీ దంపతులు రాజభవనం వద్దకు రాగానే గవర్నర్ మిలిటరీ కార్యదర్శి మేజర్ నంబియార్ ప్రైవేట్ కార్యదర్శి సుందరం వారిని పుష్పమాలాలంకృతులను చేశారు. అంతట మేజర్ నంబియార్ కర్నూలులో పత్రికా విలేఖరులను, స్థానిక ఆహ్వాన సంఘసభ్యులను త్రివేదీకి పరిచయం చేశారు. గవర్నర్ వారితో కరచాలనం చేశారు.

గుత్తినుంచి కర్నూలువరకు దారిలో అనేకచోట్ల గవర్నర్‌కు స్వాగతం చెబుతూ తోరణాలు కట్టబడ్డాయి. పేట్లి, ఫోన్, వెల్దుర్తి, ఉలిందకొండ గ్రామాలలో ప్రజలు త్రివేదీకి పూలమాలలు వేశారు. పేట్లి గ్రామంలో స్త్రీలు గవర్నరు దంపతులకు హారతి ఇచ్చి, వారి నొసట తిలకం పెట్టారు. ఉలిందకొండ గ్రామంలో పంచాయితీ బోర్డు, వల్లికార్జునమిల్లువారు గోదావరి వరదబాధితుల నిధికి గాను త్రివేదీకి 232 రూపాయలకు రెండు చెక్కులు అందచేశారు. (వి. వి.)

కన్యాపహరణం!



ప్రకాశం పంతులుగారు ప్రజా-సోషలిస్టు పార్టీకి "సలాం" కొట్టి కాంగ్రెసు పార్టీలో తిరిగి ప్రవేశించారు. — వార్త.

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అకస్మాత్తుగా వామపక్షాలపై ప్రభుత్వ పోలీసు దాడి

గుంతకల్ - విజయవాడ లైనులో ఇంజన్ బోల్తా

విజయవాడ, సెప్టెంబరు 28

గుంతకల్-విజయవాడ మీటర్ గేజి లైనులో గతరాత్రి ఒక ఇంజన్ బోల్తా పడటం వలన 8 గంటలపాటు రైళ్ళ రాకపోకలకు ఆటంకం కలిగింది.

6 గురు శాసనసభ్యుల అరెస్టు

◆ ◆ ◆

రాష్ట్ర వ్యాపితంగా నేడు జరుగనున్న ఆకలి యాత్రలను భగ్నపరచే యత్నం

కలకత్తా, సెప్టెంబరు 27

పశ్చిమ బెంగాల్ అంతటా ఈవేళ తెల్లవారుజామున డిటెన్షన్ చట్టంక్రింద పోలీసులు కమ్యూనిస్టు, తదితరవామపక్షాల కార్యకర్తలను, ట్రేడ్ యూనియన్ నాయకులను ఆరెస్టు చేశారు.

అరెస్టు చేయబడిన వారిలో ఆరుగురు కమ్యూనిస్టు శాసన సభ్యులు కూడా ఉన్నారు.

రేపు రాష్ట్రమంతటా ఆకలి యాత్రలు జరపాలన్న ఐక్యక్షామ ప్రతిఘటనా కమిటీ యిచ్చిన పిలుపుదృష్ట్యా ప్రభుత్వం ఆకస్మాత్తుగా వామపక్షాలపై దాడి ప్రారంభించినట్లు తెలుస్తోంది.

రేపు జరుపవలసిన ప్రదర్శనాల కార్యక్రమాన్ని గురించి ఐక్యక్షామ ప్రతిఘటనా కమిటీ ప్రకటన పూర్తిపాఠాన్ని నేడు కమ్యూనిస్టు దినపత్రిక "స్వాధీనత" ప్రచురించింది. ఈ ఐక్య కమిటీలో రాష్ట్రంలో వామపక్షాలన్నిటికీ ప్రాతినిధ్యం ఉంది. ప్రజలకు మంచి బియ్యాన్ని చౌకధరల్లో అందజేయాలనీ, నిరుద్యోగంతో అలమటించుతున్నవారి సహాయార్థం రాష్ట్రప్రభుత్వంవారు 4 కోట్ల రూపాయలను వెంటనే కేటాయించాలని ఈ కమిటీ ప్రధానంగా కోరుతోంది.

గత కొద్దివారాలుగా బెంగాల్ గ్రామీణప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలవద్దకు ప్రతిరోజూ ఆకలియాత్రలు జరుగుతున్నాయి. వీటిదృష్ట్యా నేడు ఆకస్మాత్తుగా ఈ దాడిని ప్రభుత్వం ప్రారంభించినదని తెలుస్తోంది. నిన్న మంత్రివర్గం సమావేశమై వామపక్షాల కార్యకర్తలను, ఒక్కసారిగా అరెస్టుచేసి ఆకలి యాత్రలు జరుగకుండా చేయాలని నిర్ణయించబడింది.

సోదాలు, అరెస్టులు

కలకత్తా, పరిసరాల్లోనూ, నగర ప్రాంతాల్లో కమ్యూనిస్టుపార్టీ, తదితర వామపక్షాల కార్యాలయాలన్నిటిపై ఒక్కసారిగా పోలీసులు తెల్లవారుజామున దాడిచేశారు. కార్యకర్తల ఇండ్లపైకూడా దాడులు జరిగాయి.

కలకత్తా స్పెషల్ పోలీసు బ్రాంచి ఉద్యోగులు బెంగాల్ శాసన సభా ప్రతిపక్ష నాయకుడైన శ్రీ జ్యోతిబాసు యింటిని సోదా చేశారు. అయితే పోలీసులు వెళ్ళినప్పుడు ఆయన యింటి వద్ద లేరు.

ఎంతమందిని అరెస్టు చేసిందీ అధికారరీత్యా తెలియడంలేదు. అనధికారరీత్యా ఉదయానికి 125 మంది అరెస్టు చేయబడినట్లు తెలుస్తోంది. హోమ్ సెక్రటరీని పత్రికా విలేఖరులు కలుసుకొనగా ఇప్పటివరకూ ఎంతమంది అరెస్టు అయినదీ తనకే తెలియదన్నారు.

రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులలో ఒకరైన శ్రీ విశ్వనాథముఖర్జీ, ఆయన సతి శ్రీమతి గీతాముఖర్జీ ఆయన అన్నగారైన శ్రీ అజయముఖర్జీ (పశ్చిమ బెంగాల్ మంత్రి) యింటివద్దనుండగా పోలీసులువచ్చి అరెస్టు చేశారు.

అరెస్టుచేయబడిన శాసన సభ్యులలో ఈ క్రిందివారున్నారు:

డాక్టరు రణేన్ సేన్, మానరంజన హాజ్రా, అజిత్ బోస్, సుధీర్ భండారి, తారాపద దే, లలితా సేన్, [illegible] ట్రేడ్ యూనియన్ నాయకులు.

రివల్యూషనరీ సోషలిస్టు పార్టీకి చెందిన ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీ జతిన్ చక్రవర్తి ఇంటిపై పోలీసులు దాడిచేయగా ఆయన ఇంటివద్ద లేరు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో అనేక వందల మందిని అరెస్టుచేసినట్లు, ఇండ్లను సోదా చేసినట్లు తెలుస్తోంది.

(మిగతా 4వ పేజీలో)

"పాకిస్తాన్‌తో చేరడం కాశ్మీర్‌కు క్షేమంకాదు"

ప్రధాని బక్షీ గులాం మహమ్మద్ స్పష్టీకరణ

బరాముల్లా, సెప్టెంబరు 27

"కాశ్మీర్ భవితవ్యం- ఇండియాతోనే క్షేమంగా వుంటుందికాని పాకిస్తాన్‌తో కాదు. గత 6 సంవత్సరాలలో పాకిస్తాన్ తన రాజ్యాంగంలో ఒక్క పంక్తికూడా వ్రాయలేదు" అని కాశ్మీర్ ప్రధాని బక్షీ గులాం మహమ్మద్ నేడిక్కడ వక్కాణించారు.

10 వేలమంది హాజరైన బహిరంగ సభలో బక్షీ గులాంమహమ్మద్ మాట్లాడుతూ, "ఆరేళ్ళక్రితంఅన్ని విషయాలూ ఆలోచించిన తర్వాత కాశ్మీరీయులు ఐచ్ఛికంగా ఇండియాలో చేరడానికి నిర్ణయించుకున్నారు. మన ఆర్థిక అభివృద్ధి, మన ఉభయదేశాల ఉమ్మడి ఆశయాలనుకూడ దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం చేశారు" అన్నారు.

"మనం రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, రవాణాది శాఖలలో మాత్రమే ఇండియాలో కలిశాం. ఇతర విషయాలలో మనకుపూర్తి స్వాతంత్ర్యం వుంది మనకు భారత రాజ్యాంగంలో ప్రత్యేక హోదా ఇచ్చారు. ఇది మనకు ఎంతో అనుకూలం" అని బక్షీ స్పష్టం చేశారు.

"మన భవితవ్యం పాకిస్తాన్‌తో క్షేమంగా వుండబోదు. ఆ దేశంతో కలిస్తే మనం ఆర్థికంగా ఏ విధంగానూ అభివృద్ధి చెందలేము.

మన దేశంలో నేటి పరిస్థితిని బాగుపరచాలని మనం కృషిచేస్తున్నాం. 40 సం. లతర్వాత మనం మన [illegible] సమస్యను [illegible] కలిగాం. మీ అందరి సహకారంతో ఆర్థిక స్వయంపోషకత్వాన్ని సాధించడానికి ముందుకు సాగుతాం."

బరాములాలో ఒకఇంటర్మీడియేట్ కాలేజి తెరువబడుతుందని బక్షీ ప్రకటించారు. 30 మంచాలతో ఒక ఆస్పత్రి తెరవబడుతుందని, 1947 నవంబరులో పాకిస్తాన్ దాడి దారులచే కాల్చిచంపబడిన మహమ్మద్ మక్బూల్ షేర్వానీ పేరు ఆ ఆస్పత్రికి పెట్టబడుతుందనిచెప్పారు. బారాముల్లాలో ఖాళీగల పాఠశాలలను, లైబ్రరిని తెరవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. బరాముల్లానూ, హాండ్వారానూ కలిపే వంతెన నిర్మాణాన్ని కూడా ఆలోచిస్తున్నామన్నారు.

గ్రామంలో ప్రజలు బక్షీ గులాం మహమ్మద్‌కు స్వాగతపత్రం సమర్పిస్తూ, నూతన ప్రభుత్వానికి అన్నివిధాలా సహకరించగలమని వాగ్దానం చేశారు. ప్రస్తుతం కాశ్మీర్‌లో పర్యటిస్తున్న 16 గురు ఇండియా పార్లమెంటు సభ్యులు కూడ ఈ సభకు హాజరైనారు. సభలో [illegible] మంత్రి మీర్ ఖాసిం మాట్లాడుతూ, భవిష్యత్తు నిర్మాణానికి వ్యవసాయంపై కృషి కేంద్రీకరించవలసిందిగా ప్రజలను ఆహ్వానించారు. ప్రజలను గందరగోళపరచి, ఆర్థిక సమస్యల నుంచి వారి దృష్టిని మరలించడానికి ప్రయత్నిస్తున్న [illegible] వ్యతిరేక శక్తులను ఒక కంట కనిపెట్టి వుండవలసిందిగా హెచ్చరించారు.

లోక్‌పార్టీ చెప్పిన వారినే తీసుకోడం సాధ్యపడదట

నీలం సంజీవరెడ్డిగారి ప్రకటన

కర్నూలు, సెప్టెంబరు 28

లోక్‌పార్టీవారు కాంగ్రెసులో అనుబంధ సభ్యులుగా వున్నంత వరకూ, తాము చెప్పినవారినే తమ ప్రతినిధులుగా మంత్రివర్గంలోనికి తీసుకోవాలనే డిమాండును ఏముఖ్యమంత్రిగానీ, పార్టీ నాయకుడుగానీ, సహించబోడని శ్రీ నీలం సంజీవరెడ్డిగారు నిన్న నిక్కడ పేర్కొన్నారు.

పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ శ్రీ సంజీవరెడ్డిగారు "కాంగ్రెసుపార్టీలో అనుబంధ సభ్యత్వాన్ని రద్దుచేసుకుంటామని లోక్‌పార్టీ బెదరిస్తున్నది. నాకింతవరకూ అటువంటి వర్తమానమేమీవారి వద్దనుంచి రాలేదు. వారు ఈవిషయాన్ని పునరాలోచించుకుంటారని, తొందరపడి చర్య తీసుకోరని ఆశిస్తున్నాను" అన్నారు.

ప్రకాశంగారు, కాంగ్రెసుపార్టీలో చేరినందుకు సంజీవరెడ్డిగారు సంతోషం ప్రకటించారు. "ప్రకాశంగారు కాంగ్రెసులో చేరితే, ఆయన నాకంటే పదింతలు పెద్దవారుగా వుంటారు. కాని ఆయన ప్రజా-సోషలిస్టుపార్టీలో నేవుంటేఆయనపార్టీకంటె నాపార్టీ చాలా పెద్దదిగా వుంటుంది" అన్నారు.

ఎవరెవరు మంత్రులుగా వుండాలనే విషయం ముఖ్యమంత్రే నిర్ణయించుకుంటారని సంజీవరెడ్డిగారన్నారు. తాను మెజారిటీపార్టీ నాయకుడనైనందున మంత్రివర్గ నిర్మాణానికి తననే ముందు శ్రీ త్రివేదీ పిలుస్తారని భావిస్తున్నానన్నారు. అలాంటి పరిస్థితిలో తాను త్రివేదీకిఏమిసలహాఇచ్చేదిచెప్పడానికి నిరాకరించారు. "ఇంకా 80గంటలు వ్యవధివుంది. గవర్నర్‌కు ఏమి సలహా ఇవ్వాలో ఈ లోగా ఆలోచించుకుంటాను" అన్నారు.

రాజధాని సమస్య

ఆంధ్ర కాంగ్రెసు జనరల్‌బాడీ సమావేశం అజెండాలో రాజధాని సమస్య చేర్చబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆంధ్ర రాష్ట్రావతరణ సమయంలో ఈ సమస్యను చర్చించడానికి ఇదే తగిన సమయమని రెడ్డిగారన్నారు.

ఆంధ్రరాష్ట్ర అవతరణ, మంత్రివర్గ నిర్మాణం జరుగనున్న ఈ సమయంలో ఇప్పుడు రాజధాని సమస్యను చర్చకు పెడితే, విజయవాడను రాజధానిగా చేయాలని కోరుతున్నవారు కూడా బాహాటంగా తమ అభిప్రాయాలను ప్రకటించడానికి జంకుతారేమో అని ప్రశ్నించగా, "తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించడానికి భయపడే అలాంటి బలహీన వ్యక్తులు ప్రదేశ్ కాంగ్రెసు కమిటీలో వుండటానికి తగరు"అని రెడ్డిగారు జవాబుచెప్పారు.

కర్నూలు నిర్ణయాన్ని ఆంధ్ర కాంగ్రెసు జనరల్‌బాడీ ధృవపరచకపోతే ఈ నిర్ణయాన్ని ఆమోదించిన రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గం మొత్తంగా రాజీనామా చేయవలసివుంటుందని సంజీవరెడ్డిగారు పేర్కొన్నారు. తాను మంత్రివర్గంలో చేరుతున్నందున ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామా ఇస్తానని చెప్పారు. (వి. వి.)

పోలెండు విషయాలలో అమెరికా జోక్యం

లండన్, సెప్టెంబరు 27

పోలెండులో జెస్లా కాజ్మారెక్ అనే ఒక బిషప్పు, తన క్రిందనున్న ముగ్గురు చర్చి ఉద్యోగులతో సహా ప్రభుత్వ వ్యతిరేక కుట్రలనూ, గూఢచారి కార్యకలాపాలనూ కొనసాగిస్తున్నాడని బయటపడింది. పోలెండు ప్రభుత్వం వారిని అరెస్టుచేసి, విచారణ జరిపింది. వారి నేరాలు రుజువు కావడంతో మంగళవారంనాడు బిషప్పుపై 12 సంవత్సరాల కఠిన శిక్ష విధించబడింది. అతని సహచరులు కూడా శిక్షించబడ్డారు.

ఇదివరకు పోలెండులో అమెరికా రాయబారిగా ఉండిన అర్థర్ బ్లిలేన్‌కు కుట్రదారులతో సంబంధాలుండేవన్న విచారణలో బయటపడింది.

"ఈ శిక్షలు న్యాయ సూత్రాలను అపహాస్యం చేయడం తప్ప మరొకటి కాద"ని బుధవారంనాడు, అమెరికా విదేశాంగశాఖ ఒక అధికార ప్రకటన చేసింది.

"అధికారరీత్యా ఇలాంటి ప్రకటనలు చేయడం పోలండు అంతరంగిక విషయంలో జోక్యం కలిగించుకోవడమే" అని తీవ్ర ఆక్షేపణను తెలుపుతూ, పోలెండు ప్రభుత్వం అమెరికా ప్రభుత్వానికొక నిరసన పత్రాన్ని పంపిందని వార్సా రేడియో ప్రకటించింది.

"మా దేశంలో సామ్రాజ్యవాద దేశాల ప్రతినిధులూ, వారితో చేతులు కలిపిన కుట్రదారులూ సాగిస్తున్న ఘాతుకాలనుండి ప్రజలదృష్టిని మరలించడమే అమెరికా ప్రభుత్వపు ప్రకటన ఉద్దేశం. ఇలాంటి ప్రకటనలు చేయడం, వివిధ దేశాలతో శాంతియుత సహకారసూత్రాలకే విరుద్ధం" అని ఆ నిరసన పత్రం స్పష్టం చేసింది.

"ఆ శిక్షలను గురించి మేము ప్రకటించిన అభిప్రాయాలను మేమేమీ మార్చుకోము," అని అమెరికా విదేశాంగ శాఖోద్యోగి స్పష్టంచేసినట్లు వాషింగ్టన్ వార్త.

పోలెండు నిరసన పత్రానికి అమెరికా ప్రభుత్వం అధికార రీత్యా జవాబు యివ్వదని వాషింగ్టన్‌లో అధికార వర్గాలవలన తెలుస్తూంది.

అన్ని రకములైన అభ్యుదయ సాహిత్యం
విశాలాంధ్ర, పి. పి. హౌస్, మాస్కో, పెకింగు
ప్రచురణలు
ఆంధ్ర రాష్ట్రావతరణోత్సవంలోను,
తదుపరి జరుగబోయే స్వదేశీ ఎగ్జిబిషన్‌లోను
మా స్టాల్‌వద్ద దొరకును
కాగడా బుక్ స్టాల్, కర్నూలు

1953 సెప్టెంబరు29మంగళవారం
విజయ సంవత్సర
భాద్రపద బహుళ
సప్తమి రా. 8-19
మృగశిర రా. 8-37
హస్తకార్తె

విశాలాంధ్ర

29-9-53 మంగళవారం

ఎందుకీ దాడి?

"ఆహార పరిస్థితి సంతృప్తికరంగా వున్నది" అని కేంద్ర ఆహార మంత్రి శ్రీ కిద్వాయ్ 25 వ తేదీన ఆహార సమస్యను సమీక్షు చేశారు.

ఆకలి యాత్రలు నడపటానికి ఐక్య కరువు నివారణ కమిటీ నిర్ణయించినందున 6గురు శాసన సభ్యులతోసహా కమ్యూనిస్టు నాయకుల్ని యితర వామ పక్ష నాయకులను మొత్తం 125 మందిని హఠాత్తుగా 27 వ తేదీ ఉదయాన పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అరెస్టు చేసినట్లు కలకత్తా వార్తలు.

కిద్వాయ్ చెప్పిన మాటలు వాస్తవమైతే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం యీ నిరంకుశ నిర్బంధ విధానానికి ఎందుకు పూనుకున్నట్లు?

సరసమైన ధరలకు సరిపోయినంత ఆహారం మార్కెట్లలో దొరుకుతూంటే ఏ నాయకులు రమ్మన్నా ఆకలియాత్రలకు ప్రజలు కదలరుగదా? ఆకలితోనే ప్రజలు అల్లాడిపోబట్టే గదా యింత ఆందోళన? అయితే అన్నార్తులైన ప్రజల్ని "అన్నమో రామచంద్రా" అని తమ ఆఫీసులవద్ద మొరపెట్టుకోవటానికి కూడా మన "రామరాజ్యం" అవకాశం యివ్వదా? కొంతమంది నాయకులను జైళ్లలో నిర్బంధించినంత మాత్రాన్నే ఆకలిగొన్నవారి ఆర్తనాదాన్ని ప్రభుత్వం అణచిపెట్టగలుగుతుందా? అదే నా పరిష్కార మార్గం?

నిరుద్యోగంతో అల్లాడిపోతున్న ప్రజానీకానికి కనీసం సక్రమ ధరలకు అయినాఆహారం అందించమని ఐక్య కరువు నివారణ కమిటీ కోరుతోంది. ప్రజలు చెప్పే గోడువిని దానికి పరిష్కార మార్గం ఆలోచించే దానికి బదులు ప్రజాసేవకులను, నాయకులను, శాసనసభ్యుల్ని కూడా నిర్బంధంలోపెట్టి ప్రజల నోరు కట్టటానికి పూనుకోవటం పచ్చి నిరంకుశత్వానికి మినహా మరేమీగాదు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ట్రాంచార్జీల విషయంలో ప్రజలపై లోగడ ఒకసారి దాడి చేసి తరువాత ప్రజాశక్తి ముందు తలవొంచవలసి వచ్చింది. ఆగుణపాఠాన్ని యింతలోనే మరచిపోవటం శోచనీయం.

చీటికీ మాటికీ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని ప్రయోగించి ప్రజానాయకుల, శాసనసభ్యుల పౌరసత్వ హక్కులను భగ్నపరిచే నిరంకుశ చర్యను, దమన నీతిని మేము ఖండిస్తున్నాం. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి. తియ్యని కబుర్లతో ప్రజలను భ్రమలు పెట్టే ప్రయత్నం మాని ఆహార మంత్రి కిద్వాయి సరసమైన ధరలకు ప్రజలకు ఆహారం అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

కర్నూలుకు ప్రభుత్వ సిబ్బంది ఆగమనం

ఏడు కంపెనీల ఎస్.ఏ.పి. రాక

కర్నూలు, సెప్టెంబరు 27

అభివృద్ధిశాఖా కార్యదర్శి శ్రీ ఆర్. ప్రసాద్‌గారితోపాటు మూడు వందలమంది సెక్రెటేరియట్ ఉద్యోగులు మద్రాసునుంచి స్పెషల్ ట్రెయిన్‌లో నేటి వుదయానికి కర్నూలు చేరారు. వీరిలో అయిదుగురు మాత్రమే తమ కుటుంబాలను వెంట తెచ్చుకొన్నారు. వారిని వెంటనే వారి వారి గుడారాలకు పంపారు.

కర్నూలునగరంలో ఆంధ్రరాష్ట్రావతరణ దినోత్సవంనాడు శాంతి, భద్రతల రక్షణ ఏర్పాట్ల కొరకై విశాఖ పట్టణం నుంచి ఏడు కంపెనీల స్పెషల్ ఆర్మడ్ పోలీసు దళాలు నిన్నరాత్రి ఇక్కడికి రప్పించబడ్డాయి (వి వి)

కేరళ ఆర్థిక మంత్రి బెదరింపు

ప్రజల దుస్థితిని వెలుపడానికి వెళ్ళిన ప్రతినిధులకు

త్రివేంద్రం, సెప్టెంబరు 26

తిరువాన్‌కూర్ - కొచ్చిన్ రాష్ట్రములో నేడున్న నిరుద్యోగ తీవ్రతను, ఆహారకొరతను ప్రభుత్వదృష్టికి తీసుకొనివచ్చి అందుకు తక్షణ చర్యలను తీసుకోవాలని కోరడానికి ఈవేళ కమ్యూనిస్టు నాయకుడు శ్రీ సి. అచ్యుతమీనన్ నాయకత్వాన ఒక ప్రతినిధివర్గం రాష్ట్ర ఆహార, ఆర్థిక మంత్రి శ్రీ పి గోవిందమీనన్‌ను కలుసుకుని ఒక మెమొరాండం సమర్పించింది.

మెమొరాండానికి బదులుచెపుతూ, ఆర్థికమంత్రి శాంతిభద్రతలను భంగపర్చడానికి కమ్యూనిస్టుపార్టీ ఉద్దేశ్యపడుతున్నట్లు పత్రికలలో తాను చూశాననీ, అలాంటి యత్నం జరిగితే ప్రభుత్వం కఠినచర్యలను తీసుకోడానికి వెనుదీయదని బెదరించారు.

శ్రీ అచ్యుతమీనన్ మాట్లాడుతూ తమ పార్టీకి అలాంటి ఉద్దేశ్యం ఎంత మాత్రం లేదనీ, ప్రజల ప్రస్తుత దుర్భర పరిస్థితిని నివారించడానికి కృషిసలుపుతున్నామని తెలిపారు.

మెమొరాండంలో ఉదహరించిన డిమాండ్లకు మంత్రి సమాధానం చెప్పుతూ పరిస్థితిని చక్కపరచడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని తెలిపారు. త్రిచూర్‌లో సీతారామ్ మిల్లులను మూలమున్న తకపూలోని మహాలక్ష్మి మిల్లులను తెరిపించడానికి ప్రయత్నించుచున్నామన్నారు. నిరుద్యోగ సమస్యను గురించి మాట్లాడుతూ దానిని పరిష్కరించడానికి ప్రణాళికా సంఘం పూనుకొన్నదని తెలిపారు.

ధరలు పెరిగిపోకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నదని ప్రస్తుతం ఏ చర్యతీసుకోడానికైనా ప్రభుత్వంవద్ద డబ్బులేదనీ మంత్రితెలియజేశారు. నూతన మంత్రివర్గం కొత్త బడ్జెటులో వచ్చేందుకు త్వరలో ఎన్నికలను జరపడానికి ప్రభుత్వం ఉద్దేశించుతున్నదనికూడా తెలిపారు

కాశ్మీర్‌కుఇండియా బియ్యం సరఫరా

ఏడులక్షల మణుగులు

జమ్మూ, సెప్టెంబరు 26

ఇండియా ప్రభుత్వం కాశ్మీర్‌కోసం ఏడు లక్షలమణుగుల బియ్యాన్ని కేటాయించింది. శీతాకాలంలో అవసరమైనంత నిల్వవుండి అక్కడ ఆహారధాన్యాల ధరలు పెరగకుండా వుండేందుకే ఇండియా ప్రభుత్వం ఈసహాయం చేస్తున్నదని నేటిరాత్రి అధికారికంగా ప్రకటించబడింది.

కేటాయించబడిన బియ్యంలో కొన్ని టన్నులు అప్పుడే కాశ్మీరుకు రవాణా చేయబడినాయనికూడా తెలుస్తోంది

రంగనగూడెం

నూజివీడు తాలూకా ప్రాథమికోపాధ్యాయుల సంఘ కార్యవర్గ సమావేశం శ్రీ వీరమాచనేని సుబ్బారావు గారి అధ్యక్షతను ఈ నెల 20 వ తేదీన రంగనగూడెంలో జరిగింది. గోదావరి వరద బాధితుల సహాయార్థం సెంటర్ క్లాసు నిధులను వినియోగించాలని తీర్మానించబడింది. ఆ రాత్రి జరిగిన బహిరంగసభకు శ్రీ ముద్వా కొండయ్యగారు అధ్యక్షత వహించారు. నూతన విద్యా ప్రణాళిక అమలు జరపడం వల్ల కలిగే దుష్ఫలితాలను గురించి శ్రీ ఉప్పలేటి ప్రసాదరావు గారు వివరించారు; మరికొందరు మాట్లాడిన తరువాత సభ ముగిసింది.

ఆంధ్ర మహాసభ నిజాం ఆంధ్రులందరికీ సంస్థ

కన్వెన్షను ప్రతినిధులకు ఆహ్వాన సంఘాధ్యక్షుని హెచ్చరిక

హైద్రాబాద్ సెప్టెంబరు 27

"ఆంధ్రమహాసభ హైద్రాబాద్ రాష్ట్రంలోని ఆంధ్రులందరికీ ప్రాతినిధ్య వహిస్తుంది. ఇది ఏ ఒక్క పార్టీకీ సంబంధించిన సమస్యకాదు. హైద్రాబాదు ఆంధ్రులను అన్ని విధాల-ఆర్థికంగా, సాంస్కృతికంగా, సాంఘికంగా-అభివృద్ధి చేయడమే దీని ఆశయం." అని నేడు ఇక్కడ సమావేశమయిన ఆంధ్రమహాసభ కన్వెన్షన్ ప్రతినిధులను ఆహ్వానిస్తూ శ్రీ కె. ఆర్ వీరాస్వామిగారు ఉపన్యసించారు.

నేడు ఇచ్చట ప్రారంభ మయిన ఆంధ్రమహాసభ కన్వెన్షను ప్రతినిధుల నుద్దేశిస్తూ, ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ కె. ఆర్. వీరాస్వామిగారు (ఎమ్. ఎల్ ఎ) యిలా ఉపన్యసించారు

"ఈ కన్వెన్షను ఏ ఒక్క పార్టీకి సంబంధించిన సమస్యగాదు. తమ సర్వతోముఖాభివృద్ధిని కోరే హైద్రాబాదు ఆంధ్రులందరికీ ఇది ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఆంధ్ర మహాసభ మన స్టేటులో కమ్యూనిస్టుపార్టీగా మూడబడుట ఒక యాదృచ్ఛిక ఘటన. దాని అభివృద్ధిలో ఇది ఈ మధ్యన వచ్చిన మార్పు మాత్రమే. ప్రారంభంలో హైద్రాబాదు ఆంధ్రుల అభివృద్ధికి అన్నివిధాల ప్రాతినిధ్యం వహించిన సంస్థ ఆంధ్ర మహాసభ ఒక్కటే వున్నది అందరికీ తెలిసిందే. సుమారు 1944 సం॥ కాలంలో, దానియొక్క ముఖ్య నాయకులు ఎందరో దాన్ని వదలి కాంగ్రెసులోను, ఇతర రాజకీయ పార్టీలలోను కలసిపోయారు. తర్వాత మాత్ర సంస్థలో మిగిలిపోయినవారు కమ్యూనిస్టులుగా పేరు పెట్టబడినారు ఇట్లు మిగిలిన వారిలో కొంతమంది కొంతకాలం తరువాత దాన్ని వదలి, తమ ప్రత్యేక రాజకీయ పార్టీగా సంస్థాన కమ్యూనిస్టుపార్టీని ఏర్పరచుకొన్నారు ఇక మిగిలిన కొద్దిమంది దాని మొదటిలక్ష్యాల ప్రకారం పని సాగించారు. వెనుకటి నుండి ఉండి, తర్వాత దీన్ని వదలి కాంగ్రెసులో కలసిన వారు తర్వాత ఆంధ్రమహాసభతో సంబంధాలు కల్గించుకోక పోవటం తలవని తలంపుగా జరిగినదే అన్నా, దీన్నివదలి కమ్యూనిస్టుపార్టీలో చేరిన క్యాడరు ఆంధ్రమహాసభతోగల సంబంధాలను వదలుకోక పోవటం కూడా అట్లాగే తలవనితలంపుగా జరిగింది ఇందువల్ల ఇది కమ్యూనిస్టుల పెత్తనం క్రింద ఉన్న సంస్థ అనే దురభిప్రాయం కలిగింది

"ప్రస్తుత మిచ్చట సమావేశమవుతున్న ఆంధ్రమహాసభ కన్వెన్షను చాల విశాల ఆశయాలను, లక్ష్యాలను కలిగియున్నది హైద్రాబాదు ఆంధ్రులను అన్ని విధాలుగా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతికంగా అభివృద్ధి చేయటమే దీని ఆశయం.

"హైద్రాబాదు చరిత్రలోనేగాక, మన దేశ లోనూ, ప్రపంచములోనూ చాల క్లిష్టస్థితి ఏర్పడివున్నప్పుడు ఈ కన్వెన్షన్ సమావేశమవుతున్నది. ప్రతిచోటా కష్టజీవుల స్థితి బాగుచేయాలనే కోరిక, నినాదం వినవస్తున్నది. ఈకోర్కె వివిధసిద్ధాంతాల సంఘర్షణను తెచ్చింది. ఒకరు ఎక్కువలో ఎక్కువ మంది అభివృద్ధిని కోరుతుంటే, ఇంకొకరు అత్యల్పమైన సంఖ్య అభివృద్ధిని కోరుతున్నారు. ఈవిధంగా ప్రపంచములోని దేశదేశాలన్నిటి చరిత్రలో పెద్ద మార్పులు వస్తున్నవి.

ప్రపంచగతిలో మార్పు

"చైనాలో నూతనపరిపాలనావ్యవస్థ స్థాపించబడటం చూశాం. మధ్యప్రాచ్యం లోను, ఆగ్నేయాసియాలోను పెద్ద మార్పులు చూస్తున్నాం. ప్రపంచమంతటా అణచబడిన ప్రజల స్థితిని బాగుచేయు ప్రయత్నాలనివి సూచిస్తున్నవి అందుచే మనం ప్రస్తుత పరిస్థితుల గమనాన్ని గ్రహించి, మన దేశంలోని అత్యధిక సంఖ్యాకుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి

"నైజాం నిరంకుశపాలనా బంధాల నుండి అసంపూర్ణంగానైనా విముక్తి చేయబడి 5 సంవత్సరాలయినా కాలేదు 'అసంపూర్ణంగా' ఎందుకంటున్నానంటే 1948 సెప్టెంబరు 18 నుండే కాదు. నైజాం రాజప్రముఖుగా, ప్రజాస్వామ్యం ప్రభుత్వం స్థాపించబడిందని చెప్పబడే 1952 మార్చి 6 తర్వాతకూడా, నైజాం యొక్క పెత్తనం పోలేదు. దీనినుగురించి ఇంకా పెద్దగా చెప్పుకుంటూ, హైద్రాబాదు ప్రజల అభివృద్ధికి వ్యతిరేకంగా, అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ శక్తులను సమీకరించే స్వేచ్ఛను అతడింకా కలిగియున్నాడు. నైజాం రాజప్రముఖుగా ఉండి, సంస్థానం విచ్ఛిన్నం చేయబడనంతకాలం కుట్రలకు, ప్రతికుట్రలకు, హైద్రాబాదు ఎల్లప్పుడూ కేంద్రంగా ఉంటుంది. అందుచే హైద్రాబాదు ప్రజలకు స్థిరమైన ప్రభుత్వము ఉండదు. దీనితో హైద్రాబాదు ప్రజల సర్వతోముఖాభివృద్ధి అరణ్య రోదనమే అవుతుంది. కాబట్టి విశాలాంధ్ర సమస్య పైకొస్తున్నది. ఇది హైద్రాబాదు సంస్థానాన్ని విచ్ఛిన్నం చేయనిది సాధ్యం గాదు. స్టేటులోని 90 లక్షల ఆంధ్రులు రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి కావాలంటే ఇచ్చట సమావేశమైన వారంతా ఇందులకై కృషి చేయాలి.

నిరుద్యోగం

పారిశ్రామిక, వ్యవసాయక రంగాల్లో, వర్తక విషయంలో గూడ నిరుద్యోగం పెరుగుతున్నది. భూమిపై ఒత్తిడి ఇదివర కెన్నడూ లేనంతగా పెరుగుతున్నది. ఆర్థిక మాంద్యం, పారిశ్రామిక, వర్తక శాఖలకు గూడా వ్యాపిస్తున్నది. ఒకవైపున ప్రజల కొనుగోలుశక్తి పడిపోతుంటే, జీవిత పరిమాణం, ధరల ఇండెక్సు ఇంకోవైపున పెరుగుతున్నవి. పెద్దయెత్తున భూములనుండి తొలగించటం జరుగుతున్నది. గొప్పగా చెప్పుకునే భూమి సంస్కరణలు, కౌలుదారీ శాసనాలు ఉన్నా భూమి లాక్కోబడి, కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించబడుతున్నది. లంచగొండితనం, బంధుప్రీతి అతితీవ్రంగా పెరుగుతున్నది ఇవి, ఇంకా ఇతరకష్టాలు ఏకమై, సామాన్య ప్రజల, మధ్యతరగతి ప్రజల స్థితిని దుర్భరంచేస్తున్నవి. ఈ కన్వెన్షను ఎదుర్కొని పరిష్కరించవలసిన సమస్యలలో ఇవి కొన్ని.

"వివిధ రాజకీయ భావాలున్నా ఇచ్చట సమావేశమయిన వారందరం సిద్ధాంత చర్చలు, ప్రతి చర్చలతో కాలక్షేపం చేయక, వీటిపై గట్టిగా ఆలోచించి, అవసరమైన సంస్కరణల సాధించుటకై ఆచరణ యోగ్యమైన సాధనోపాయములను ఆలోచించుదాం ఆ విధంగా ప్రజల్లో తమ భావిని గురించి ఒక నూతన దృక్పథాన్ని, ఒక నూతన దృష్టిని తీసుకరాగల్గుతాం. ఇది నా సవినయ కోరిక. ప్రార్థన."

మైనారిటీల హక్కులు సంరక్షించ బడతాయి

శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారి ఉద్ఘాటన

(మొదటి పేజీ తరువాయి)

"ఈ మహా పోరాటంలో ప్రజలు అసంఖ్యాకంగా పాల్గొని అనేక త్యాగాలుచేశారు. తత్ఫలితంగా అనేక మార్పులు వచ్చాయి. పోలీసు యాక్షను జరిగింది ప్రజలు అనేక నిర్బంధాలకు గురిచేయబడ్డారు.

"ఎన్నికల తరువాత ఆంధ్ర మహాసభపై నిషేధం తొలగించారు.

"నైజాం కాలంలో ఆంధ్రమహాసభ క్రింద ప్రజలు సంస్థాన విచ్ఛిత్తికి పోరాటం సల్పారు. నేడు కాంగ్రెసు ప్రభుత్వం, ప్రజలరక్తంపీల్చిన నైజాంనే రాజప్రముఖునిచేసి, సంస్థానాన్ని అట్టే అట్టిపెట్టుతున్నది. వారుకూడా నైజాం కాలంలో విచ్ఛిత్తినే కోరారు. కాని, ఈనాడు ఆ మాట పలకటం లేదు రాజప్రముఖ పదవిరద్దు చేయకపోగా పైగా కోటిరూపాయలు భరణం యిస్తున్నారు. ఈ కోటిరూపాయలెందుకిస్తున్నారని ప్రజలు, కాంగ్రెసు వారు కూడా అడుగుచున్నారు.

"విశాలాంధ్ర సాధ్యమని ప్రజలే కాకఅన్ని పక్షాలవారు, చివరకు కాంగ్రెసులోని కొందరుకూడా నమ్ముతున్నారు కాని ప్రభుత్వం దీనికి పూనుకోవటం లేదు. కేంద్రప్రభుత్వం వ్యతిరేకిస్తున్నది. విచ్ఛిత్తి సాధ్యపడదని నెహ్రూ స్పష్టంచేశారు. విశాలాంధ్రను అందరూ కోరుచున్నారు. కాబట్టిదానంతటదే వస్తుందని అనుకో వీలులేదు. దానికి చాలా ఆటంకాలున్నాయి. ఆంధ్రరాష్ట్రం కొరకు ప్రజలు కదిలి, ఆందోళన చేసి పోరాడినట్లుగా మనం పోరాడితేనే, త్యాగాలుచేస్తేనే ఆంధ్రరాష్ట్రంలాగా విశాలాంధ్ర వస్తుంది.

విశాలాంధ్ర మహాసభ

"ఈ సర్వవ్యాపిత విశాలాంధ్ర వాంఛను గమనించి కొందరు కాంగ్రెసువారు కొన్ని ప్రయత్నాలు ప్రారంభించారు కాశీశ్వరరావుగారు 3 సంవత్సరాలక్రితం - వరంగల్లులో జరిగిన విశాలాంధ్రసభ నుండి ఇప్పటిదాకా కదలక ఇప్పుడే కదిలారు. దీనిఉద్దేశ్యం ఏమిటి? విశాల ఉద్యమ నిర్మాణ ఉద్దేశ్యమేవుంటే దానికి కృషిచేశారా? చేయలేదు. దాన్ని విశాల ఉద్యమంగా అభివృద్ధిగాకుండా కమ్యూనిస్టులను కలుపుకో వీలులేదంటున్నారు. ఎందుకు కలుపుకోవీలులేదని కొందరడిగిన ప్రశ్నకు, ఇది స్వతంత్రరాష్ట్రంగా ఉండాలని కమ్యూనిస్టులు కోరుచున్నట్లు అభాండంవేశారు. కమ్యూనిస్టులు కోరుచున్నదిఅదికాదని. వారు తెలియకచెబుతున్నారా? కాదు. బాగా తెలుసు. అందరూవిశాలాంధ్రను కోరవచ్చును కమ్యూనిస్టులను రాకుండాచేసిన దానికి కారణం ఆ అపవాదు మాపడానికే కాంగ్రెసు పైనాయకులు వ్యతిరేకంగావున్నా మిగతా క్రింది సెక్షన్సు విశాలాంధ్రను కోరుచున్నారు. వ్యవసాయ బిల్లును వ్యతిరేకించుతున్న కాంగ్రెసువారంతా విశాలాంధ్రను కోరుచున్నారు. కాంగ్రెసువారు బయట నడుస్తున్న విశాలాంధ్ర ఉద్యమంలో పాల్గొనకూడదని తాకీదులు జారీ అయ్యాయి ఈ తాకీదులు పాల్గొనేవారిని ఆపలేవు దీన్నిబట్టి కాశీశ్వరరావుగారి విశాలాంధ్ర ఉద్యమం నిజమైన విశాలాంధ్ర ఉద్యమ నిర్మాణం కొరకేనా, అన్న అనుమానం నన్ను బాధిస్తున్నది. వారి విశాలాంధ్ర ఉద్యమంలో మేమంతా చేరటానికిసిద్ధంగావున్నాం. అలాగే వారినందరినీ ఆంధ్రమహాసభలోకి ఆహ్వానిస్తాం. విశాలాంధ్ర మహాసభ, ఆంధ్రమహాసభ కలిసి ఐక్యవేదికగా పని చేయాలని వారిని కోరుచున్నాం. వారిలోని చాలామంది ఈ ఐక్యతకొరకు కృషి చేశారు. యికముందు కూడా అలాంటి కృషి చేస్తారని నాకు నమ్మకం వుంది

"హైద్రాబాదు, సికింద్రాబాదు పురపాలక సంఘాలు, హైద్రాబాదును విచ్ఛిత్తిచేసి, తెలంగాణాను ఆంధ్రలో కలిపి వేయాలని తీర్మానాలు చేశాయి.

"ఇందులో ఈ తీర్మానాలు తెచ్చిన వారు కాంగ్రెసువారే వారి ఈ ఆశయము సఫలం కావాలంటే నేను వారితో ఐక్య వేదికను కోరుతాను.

మైనార్టీల సమస్య

"మైనారిటీల సమస్య ముఖ్యంగా ముందుకొస్తున్నది. ఇప్పుడున్న కొద్ది అవకాశాలు కూడా వారికి లేకుండా పోతాయేమోననే అనుమానాలు వారికి వస్తున్నాయి. అనుమానాలను తొలగించడానికి స్పష్టంగా ప్రకటన చేయాలిసి వుంటుంది. వారి హక్కులకు సంపూర్ణ రక్షణఉంటాయని నేను మహాసభ తరపున హామీయిస్తున్నాను.

"నిరుద్యోగ సమస్య హైదరాబాదు సంస్థానంలో పెరిగిపోతున్నది. దేశమంతటి లాగానే యిక్కడకూడా తీవ్రస్వరూపం దాల్చింది పనులులేక అల్లాడుతున్నారు. విశాలాంధ్ర వస్తే కొత్త ఉద్యోగాలు వస్తాయా? లేక వున్నవి ఊడిపోతాయా అని అనుమానాలు వెలిబుచ్చుతున్నారు. వారు అలా అనుమానించ పనిలేదు. ఎవరి హక్కులు వారికుంటాయి.

"విశాలాంధ్ర ఏర్పడితే పరిశ్రమలఅభివృద్ధికి ప్రాజెక్టుల నిర్మాణానికి అవకాశం ఏర్పడుతుంది. అయితే వెంటనే సమస్యలన్నీ పరిష్కారం కావు. కాని వాటికి మార్గం సుగమమవుతుంది.

"విశాలాంధ్ర గురించి వుండే అనుమానాలను పోగొట్టుకోవాలి ఏదో ఒకరిద్దరు చెడు బుద్ధులనుచూచి భయపడాలిసిన పనిలేదు. హామీలు, రక్షణలు కాగితంమీదకోరినంత మాత్రానప్రయోజనంలేదు. అందరంకలిసి కృషిచేసినప్పుడే అనుమానాలను దూరం చేసుకోగలుగుతాం. విశాలాంధ్రను ఏర్పరచుకోగలుగుతాం.

"విశాలాంధ్రసాధనకు ఉద్యమాన్ని గట్టి పునాదులపై నిర్మించి తక్షణమే ఆందోళన చేయాలి. దానికి అవసర కార్యక్రమం వేసుకోవాలిసి వుంటుంది.

ఇంతవరకు ఆంధ్రమహాసభ అన్ని సమస్యలను తీసుకొని పనిచేసింది ఇప్పుడు వివిధ వర్గాలకు వివిధ వర్గసంఘాలున్నాయి. అందుకని యిప్పుడు ఆంధ్రమహాసభ ప్రధానంగా జాతీయ సమస్యను తీసుకొని పని చేయాలిసి వుంటుంది. విజ్ఞాన, విద్యా అభివృద్ధికి కృషిచేస్తుంది.

"ప్రతినిధులు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళి సఫలం చేస్తారని ఆశించుతాను."

తరువాత కార్యదర్శి శ్రీరావినారాయణరెడ్డిగారు తమ కార్యదర్శి నివేదిక సమర్పించుతూ మాట్లాడుతూ ముందు ఆంధ్రమహాసభ చరిత్రను గూర్చిమాట్లాడారు.

ప్రకాశంగారి చర్యను ప్రజాసోషలిస్టు సభ్యులు ఆమోదించరు

విశాఖ జిల్లా ప్రజాసోషలిస్టు పార్టీ అధ్యక్షుని ప్రకటన

విశాఖపట్నం, సెప్టెంబరు 27

"ప్రజా-సోషలిస్టుపార్టీనాయకులుగానుండి నూతనాంధ్ర రాష్ట్రంలో సుస్థిర మిశ్రమ మంత్రివర్గము ఏర్పాటుచేయు అవకాశము కలదని పార్టీ కేంద్ర కార్యవర్గము సూచించినను శ్రీ ప్రకాశంగారు తమ పట్టుదలనే చూచుకొని రాజీనామా నిచ్చుట రాజకీయ రంగంలోవింతచర్యగా తోచకమానదు."

అని విశాఖ జిల్లా ప్రజాసోషలిస్టు పార్టీ అధ్యక్షులు శ్రీబుద్ధిరాజు శ్రీశైలమల్లికార్జునరావుగారు తమ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రకటనలో యింకా యిలా వివరించారు.

"శ్రీ ప్రకాశంగారిచర్య ఎట్టి క్షేమదృష్ట్యానైనను నేటి అవకాశవాదులకు పూర్తిగా ఆదర్శమగుచున్నది. కాంగ్రెసుపార్టీ ఒక మూల ప్రజాసోషలిస్టు పక్షమును మిశ్రమ మంత్రివర్గమునకు సహకారమును కోరుచున్న పక్షములో ప్రజాసోషలిస్టునాయకుడు తమ పక్షమును వదలుకొనవలసిన గత్యంతరం లేదు.

ఆంధ్రరాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యానే గాక పార్టీయొక్క గౌరవ ప్రతిష్టలను కాపాడవలసిన బాధ్యతతోనే కేంద్ర కార్యవర్గం తీర్మానముచేసినది. రాష్ట్ర ప్రజాసోషలిస్టులయొక్క అభిమతాన్ని రాష్ట్రశ్రేయస్సును కేంద్రకార్యవర్గము తిరస్కరించినదన్న ఆరోపణ సత్యమైనది కాదు.

రాష్ట్ర పార్టీ సభ్యుల అభిప్రాయము శ్రీ ప్రకాశంగారు తీసుకొనలేదు. ఆగష్టు నెలలో జరిగిన రాష్ట్ర ప్రతినిధుల సభలో అధికసంఖ్యాకులు మిశ్రమ మంత్రివర్గమునకే అంగీకరించియుండలేదు. ఈ అభిప్రాయము వెలిబుచ్చిన పైన కాంగ్రెసు పార్టీతో ఎట్టి సంబంధబాంధవ్యము ఉండవలసినది తేల్చుటకు ఈ సమస్య కేంద్ర కార్యవర్గమునకు విడిచిపెట్టడమైనది. కేంద్ర పార్టీ నిర్ణయము తేలకమునుపే శ్రీ ప్రకాశంగారు కాంగ్రెసు నాయకులతో స్వతంత్రించి సంప్రతింపులు చేసి తాను తమ పార్టీనుండి కాంగ్రెసు పక్షముతో పొత్తు కలుపుటకు అనుమతి యివ్వవలసినదని ఒక క్లిష్ట సమస్యను లేవదీశారు. ఇది రాష్ట్రంలో పార్టీ సభ్యులు యావన్మంది అభిప్రాయము కాదని తెలియజేయుచున్నాము.

అల్పసంఖ్యాకులుగానుండి కాంగ్రెసు పక్షమును అదుపాజ్ఞలలో పెట్టునని ప్రభుత్వ నిర్ణీత కార్యక్రమం చేయకలుగుదుమాలేదా అనే సంశయము వల్లనే ఆంధ్రలో ప్రజాసోషలిస్టుపార్టీ జిల్లా కమిటీలన్నీ తీర్మానించి రాష్ట్ర కమిటీకి అందజేసియున్నవి. ఆంధ్రలో పార్టీ యొక్క గౌరవ ప్రతిష్టలను కృషిచేయుచున్న అధిక సంఖ్యాకులైన సభ్యులయొక్క అభిప్రాయమే నేటి కేంద్ర కార్యవర్గముయొక్క తీర్మానమైయున్నది. దీనిని కాదనుటకే రాష్ట్ర కార్యవర్గం తమపార్టీ శిక్షణ తప్పి శ్రీ ప్రకాశంగారు వైదొలగుటకున్నూ, కాంగ్రెస్‌లో సహాయసభ్యులుగాచేరుటకున్నూ, ఆమోదించినది ఇట్టితీర్మానమును రాష్ట్రములో ప్రజాసోషలిస్టు సభ్యులు ఆమోదింప జాలరు. ఒకప్రక్క తమ నిర్ణయమునకు కేంద్రమునుండి ఆమోదమును కోరుచూ, మరియొక పక్షమున శ్రీ ప్రకాశంగారు వైదొలగి వారు చేయుచున్న ఎట్టి చర్యనైననూ సమర్థించుటకు ప్రమాణము తీసుకొనుచున్న ఈ కార్యవర్గ సభ్యుల చర్యను గర్హించుచున్నాము. ఈనాడు శ్రీ ప్రకాశంగారు పార్టీనుండి తమమాట చెల్లలేదని తొలగిపోవుటకు నిశ్చయించి ఈ నింద కేంద్ర కార్యవర్గముపైన మోప ప్రయత్నించుట సమంజసమైనది కాదు.

ఇట్టి ప్రవర్తనలోగల అంతరార్థమును ప్రజలు గ్రహించుకోగలరు. నూతనాంధ్ర రాష్ట్రములో సుస్థిర మంత్రివర్గం స్థాపించు బాధ్యత ప్రజా-సోషలిస్టు పక్షమునకేగాక వారితో సహకరించు పక్షములన్నింటికీ కలదనే విషయము తెలుసుకోవలయును.

పరస్పర పక్ష గౌరవములను మన్నించిననాడే ఇట్టి సుస్థిరం చేకూరగలదు. ఈ అభిమతమునకే కేంద్ర కార్యవర్గం శ్రీ ప్రకాశంగారిని మిశ్రమమంత్రివర్గమునకు వ్యక్తిగతముగాగాక పార్టీ తరఫున యత్నించవలసిందని పదవికొరకు పార్టీని విడుచుట అసమంజసమనీ చేసిన తీర్మానంయొక్క ఉత్కృష్టతను గ్రహించక అపార్థమును కలుగ చేయుచున్నందుకు విచారపడుతున్నాను."

కలకత్తాలో జూట్ కార్మికుల ప్రదర్శనం

కలకత్తా, సెప్టెంబరు 26

కలకత్తా పరిసరాల్లోని జూట్ మిల్లులకు చెందిన 10 వేలమంది కార్మికులు నేడు ఇండియన్ జూట్ మిల్లుల సంఘ కార్యాలయం ముందు మూడు గంటలపాటు ప్రదర్శనం జరిపి, పూజా సెలవులలోగా 3 నెలల బోనస్ ఇవ్వాలని డిమాండు చేశారు.

కమ్యూనిస్టు నాయకులు శ్రీయుతులు బంకింముఖర్జీ, రణెన్ సెన్, యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కార్యదర్శి శ్రీ జతిన్ చక్రవర్తి జూట్ మిల్లు సంఘం లేబర్ ఆఫీసరును కలుసుకుని, సమాలోచనలు జరిపారు. తరువాత వారు ముఖ్యమంత్రి డాక్టరు బి. సి రాయ్‌ని కలుసుకుని కార్మికులకు బోనస్ ఇవ్వవలసిన అవసరాన్ని వివరించారు.

అనంతరం ప్రదర్శకులుఊరేగింపుగా కలకత్తా మైదానంవద్దకు వెళ్ళారు. అక్కడ సభజరిపి, తమ కోర్కెలను వివరిస్తూ తీర్మానం చేశారు.

తెనాలి పట్టణంలో పాల వ్యాపారుల అరెస్టు

శానిటరీ యినస్పెక్టరు అక్రమాలను అరికట్టాలని ఆందోళన

తెనాలి, సెప్టెంబరు 27

గుంటూరుజిల్లా తెనాలిపట్టణ పాల వ్యాపారులు యిటీవల సంఘంగా యేర్పడ్డారు. శానిటరీ యినస్పెక్టర్లవల్ల తమకు కలుగుతున్న యిబ్బందులను తెలియజేస్తూ సంఘంతరఫున పైఅధికార్లకు, ఆరోగ్యశాఖామంత్రిగారికి వినతిపత్రాలు సమర్పించారు.

పై అధికార్లు దానిపై యేమీచర్య తీసుకోలేదు. కాని శానిటరీ యినస్పెక్టరు మాత్రం వ్యాపారులపై కక్షవహించి లైసెన్సులున్నప్పటికీ పాల వ్యాపారులను నలుగురిని అరెస్టు చేయించారు.

పై అధికారులు కలుగజేసుకొని తెనాలి శానిటరీ యిన్‌స్పెక్టరు, పాల వ్యాపారులపై సాగించే అక్రమాలను అరికట్టాలని పాల వ్యాపారులు ఆందోళన చేస్తున్నారు.

లేఖలు

ఉపాధ్యాయులకు సెప్టెంబరు నెల జీతాలు

మహాశయా,

ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భమున అక్టోబరు 1 వ తేదీలోగా అనగా సెప్టెంబరు 30 వ తేదీకి ముందరాను ప్రభుత్వోద్యోగులందరికి గ్రామోద్యోగులతో సహా జీతాలు బట్వాడా చేయవలసినదిగా ప్రభుత్వం ఉత్తరువులు అందజేసినది. అయితే అందులో గ్రామసీమలలో పనిచేయుచున్న ఉపాధ్యాయుల సంగతి ఉన్నట్లులేదు. డిపార్టుమెంటులలోవిచారించగా వారు మాకు ఏలాటి ఉత్తరువులు రాలేదనుచున్నారు. రాష్ట్రావతరణ దినోత్సవం ఆనందంగా జరుపుకొన వలయునని, కుతూహలముతో వున్న ఉపాధ్యాయలోకానికి తీరని ఆశాభంగం కలిగినది. గాన యిప్పుడయినా వెంటనే సెప్టెంబరు 30 వ తేదీ నాటికి అన్ని సంస్థలలో పనిచేయు ప్రాథమికోపాధ్యాయులకు జీతాలు ముట్టునట్లు వుత్తరువులు జారీ చేయవలయుననికోరుచున్నాను.

ఇట్లు
నారుసుబ్బన్న, రాయచోటి
25—9—53

లేఖాంశాలు

రాయలసీమ కళాశాలలను ఆంధ్ర విశ్వవిద్యాలయంతో అనుబంధం చేయడం, రాయలసీమలో ప్రత్యేక విశ్వవిద్యాలయం నెలకొల్పడం ఆదిగాగల సమస్యలను గురించి చర్చించే నిమిత్తం ఆంధ్ర శాసనసభ్యుల సమావేశం వెంటనే జరగాలని అనంతపురం పట్టణ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ టి కృష్ణారెడ్డిగారు వ్రాస్తున్నారు.

ప్రయాణీకులపట్ల రైల్వే ఉద్యోగుల నమ్రతాభావం

గౌరవలాంఛన పూర్వక వారోత్సవం

ఢిల్లీ, సెప్టెంబరు 27

అక్టోబరు 2 వ తేదీ మొదలు 9 వరకు భారత యూనియన్‌లోని రైల్వే ఉద్యోగులు లాంఛనప్రాయమైన గౌరవ వారోత్సవం జరుపనున్నారని అధికార పూర్వకంగా ప్రకటించబడింది అనేక లక్షలకొలదీవున్న రైల్వే ప్రయాణీకుల వర్తకులపట్లసౌజన్యతను, మర్యాదను పాటించడమే ఈ వారోత్సవాల ఆశయం, సామానులను ఎగుమతి దిగుమతులు చేసుకుంటున్నప్పుడు రైల్వే ఉద్యోగులు వర్తకులకు ధన్యవాదాలు" అని "క్షమించకోరుతాము" మొదలగు గౌరవ వాచకాలతో సంబోధించగలరు. ప్రజలకు ఎప్పుడు ఎలాంటి సహాయంకావలసి వచ్చినా, రైల్వే ఉద్యోగులు తమ సహకారాన్ని అందిస్తారు.

ప్రజలుచేసే ఫిర్యాదులను, సూచనలను సౌహార్దతతో స్వీకరిస్తూ ఉద్యోగులు తగిన అవసర చర్యలను గైకొంటారు. ప్రజలకు టెలిఫోనులో సమాధానాలు చెప్పేటపుడు, ఎంతో నమ్రతను ప్రదర్శించగలరు.

ఈ వారోత్సవానికి గాను, సప్త సూత్రాలతో వాల్ పోస్టర్లను రైల్వే వారు ముద్రించనున్నారు.

ఉన్నతోద్యోగులు క్రింది ఉద్యోగులకు ఆదర్శప్రాయంగా ప్రవర్తించాలని ఆదేశింపబడ్డారు. ప్రయాణీకుల కష్ట సుఖాలను, ఫిర్యాదులను వారి అవసరాలను ఓపికతో విచారించి గౌరవ భావంతోమెలగాలని ప్రత్యేక 3 వ తరగతి ప్రయాణీకుల సౌకర్యార్థం తగు శ్రద్ధ గైకొనవలెనని రైల్వే ఉద్యోగులు కోరబడ్డారు.

ఈ గౌరవ వారోత్సవ ప్రదర్శనం వలన రైల్వే ఉద్యోగులకు ప్రయాణీకులకు మధ్య సౌభ్రాతృత్వం నెలకొల్పబడగలదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అక్టోబరు 2 నుండి 9 వరకు జరిగే ఈ వారోత్సవంలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలపట్ల ఎట్టి గౌరవ ప్రదంగా ప్రవర్తించవలసినదీ వివరిస్తూ వాల్ పోస్టర్లు కరపత్రాలు పంచిపెట్టబడగలవని తెలుస్తోంది.

మెజారిటీ నిర్ణయం పేరుతో ఇతర వాదనలకు స్వస్తి

శాసనసభా పార్టీ నాయకునిపై కాంగ్రెసు సభ్యుల ఆరోపణ

["విశాలాంధ్ర" విలేఖరి]

హైద్రాబాదు, సెప్టెంబరు 26

భూమిసంస్కరణల చట్టంపై హైద్రాబాదు శాసనసభ కాంగ్రెసు పార్టీలోని ముఠాల మధ్య మరల ఘర్షణలు తీవ్రం అవుతున్నాయి. మెజారిటీ నిర్ణయం పేరున తమ అభిప్రాయాలను అరికడుతున్నారని రామకృష్ణరావుగారి ముఠాపై ఆరోపణచేస్తూ 20 మంది సభ్యులు శాసనసభ కాంగ్రెసు పార్టీ సమావేశంలో పాల్గొన నిరాకరిస్తున్నారు.

హైద్రాబాద్ అసెంబ్లీ కాంగ్రెసు లెజిస్లేచర్‌పార్టీ నేడు శ్రీ బి. రామకృష్ణారావుగారి అధ్యక్షతన సమావేశమయి, భూమిసంస్కరణల బిల్లును గురించి చర్చించారు. సమావేశానికి 42 మందిమాత్రమే శాసనసభ్యులు హాజరయ్యారు.

భూమి సంస్కరణల బిల్లు సోమవారంనాడు అసెంబ్లీలో చర్చకు రాబోతూంది. అందుచేత అసెంబ్లీకి ముందుగానే ప్రభుత్వపార్టీని బలపరచుకొని, వ్యతిరేకదృక్పథాలను 'డిమ్మిసా' చేసెయ్యడానికి ఈసమావేశం ఉద్దేశించబడింది.

హైద్రాబాద్ ప్రదేశ కాంగ్రెసులోని వేర్వేరు ముఠాలు ఈ బిల్లులోని అంశాలను అడ్డం పెట్టుకొని, తమ కక్షలను తీర్చుకోడానికి సన్నద్ధం అవుతున్నారు. రామానంద తీర్థ ఢిల్లీ నుంచి రాగానే బిల్లులో నిర్దేశించిన 'కుటుంబ పరిమితి' భూమిచాల హెచ్చుగా వుందనీ, ఒక 'ఆర్థిక భూమి'ని యూనిటుగా నిర్ణయించాలనీ తమ అభిప్రాయంగా ప్రకటించారు. అలాగాక ఆదాయంలో భూముల వలన వచ్చే ఆదాయము అధికంగా వుండే ఆసామీ తప్ప ఇతరు లెవ్వరూ స్వంత వ్యవసాయం చేస్తాననే పేరుతో రైతులను బేదఖల్ చేసే అవకాశం ఇవ్వకూడదనే అభిప్రాయం తెలిపారు. ఈ భేదాభిప్రాయము గలవారు బిల్లుపై వోటింగులో తమ యిష్టం ప్రకటించే స్వేచ్ఛ కూడా వుండాలన్నారు.

క్రమశిక్షణ పేరుతో

రెండవ ముఠావారు 800 రూపాయలు నికరాదాయం వచ్చే భూమిని 'కుటుంబ పరిమితి'గా వుంచాలంటున్నారు. అలా అనడమే కాదు. ఆ విషయాన్ని ఆమోదించే 15 వ క్లాజు వరకూ కాంగ్రెసు సభ్యులు ఎవ్వరూ సవరణలను పంపరాదని కూడా నిషేధిస్తున్నారు. ఇదివరకే కాంగ్రెసు సభ్యులు కొన్ని సవరణలను పంపారట. ఆ విధంగా బిల్లులోని అంశాలను ప్రతిఘటిస్తున్నవారి సంఖ్య 20 వరకువున్నదని తెలుస్తుంది. దానిపై అసెంబ్లీ కాంగ్రెసుపార్టీ కార్యవర్గం ఆ సభ్యులకు జాబులు వ్రాసిందనీ, దానిలో అభిప్రాయభేదాలను పార్టీ సమావేశంలోనే చర్చించుకుని, నిర్ణయాలను అందరూ నిర్బంధంగా అనుసరించాలని కేంద్ర పార్లమెంటరీబోర్డు ఆదేశిస్తున్నట్లు తెలుపబడిందనీ చెప్పుకున్నారు. ఆ నిర్ణయానికి కట్టుబడి వుండగలిగేటందుకు గాను వారు పంపిన సవరణలను ఉపసంహరించుకోవలసిందిగా కూడాకోరారు.

దీనికి ఫలితంగా స్వామిజీ ముఠావు చెందిన 20 మంది అసెంబ్లీ కాంగ్రెసు పార్టీ సమావేశానికి హాజరు కావడం మానివేశారు. పార్టీ నాయకుడు తన ముఠా అభిప్రాయాలకు సవరణలను ఆలోచించగల స్థితిలో కూడా లేరనీ, కట్టి మెజారిటీ సభ్యుల నిర్ణయం అనే పేరుతో విభిన్నాభిప్రాయాలను తొక్కేస్తున్నారనీ, దానికి తాము వొప్పుకోజాలమనీ వీరు అంటున్నారు. కేంద్రంనుంచి తమకు ఏదో నిర్ణయం వచ్చేవరకూ బిల్లుపై చర్చను వాయిదా వెయ్యాలని వీరి అభిప్రాయమట

బిల్లుపై ఈ ముఠావారి అభిప్రాయాలను కేంద్ర పార్లమెంటరీ బోర్డువారికి ఎరుకపరచడానికై మాజీమంత్రి శ్రీ ఫూల్‌చంద్ గాంధీ నిన్ననే ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు.

రామకృష్ణారావుగారి ముఠా స్వేచ్ఛావోటింగ్ సమస్య లేనే లేదనే పట్టుదల చూపిస్తున్నారు.

నేడు కాంగ్రెసుపార్టీ కార్యవర్గ సభలో ప్రదేశ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ తీర్థ ప్రత్యేకాహ్వానంపై పాల్గొన్నారు.

రాష్ట్రావతరణ శుభసమయం

కార్మికులకు నెల బోనసు యివ్వాలని డిమాండు

చీరాల, సెప్టెంబరు 26

గుంటూరుజిల్లా చీరాల వి. యస్. టి. డి. వర్కర్సు సర్వసభ్య సమావేశం మొన్న జరిగింది. శ్రీ రాయిపాటి పుల్లయ్యగారు అధ్యక్షత వహించారు. చర్చల అనంతరం దిగువ తీర్మానాలు యేకగ్రీవంగా ఆమోదించారు.

— ఆంధ్రరాష్ట్రావతరణ శుభదినంనాడు వి. యస్. టి. డి. కంపెనీ మేనేజిమెంటు కంపెనీకి సెలవు ప్రకటించినందుకు కార్మిక ప్రతినిధులు తమ హర్షం వెలిబుచ్చుతూ తీర్మానంచేశారు.

—ఆనాడు కార్మికులందరు రాష్ట్రోత్సవాలలో పాల్గొని వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

—ఆంధ్రప్రజలందరికీ అత్యంతసంతోషదాయకమైన యీ రోజున కార్మికులందరికీ ఒక నెలబోనసు మేనేజిమెంటు యివ్వాలని కోరుతూ మరో తీర్మానం చేసారు

రాబోవు సంవత్సరానికి శ్రీ పి. శ్రీరాములుగారు అధ్యక్షులుగాను శ్రీ నూతలపాటి జోసెఫ్‌గారు ప్రధాన కార్యదర్శిగాను మరికొందరు కార్యవర్గ సభ్యులుగాను గల నూతన కార్యవర్గం ఎన్నుకొన్నారు.

వెలువడింది

రాష్ట్రావతరణ సమయంలో ఆంధ్రుల కొరకు కానుక

ఆంధ్ర ప్రజలు - సిరిసంపదలు

రచన:

ఎస్. వి. నరసయ్య ★ కె. ఎస్. రెడ్డి

ప్రత్యేకంగా ఆంధ్రదేశంగూర్చి వివిధ విషయాలను ఒకచోట సమకూర్చిన పుస్తకం ఇంతవరకూ లేదు. "ఆంధ్రప్రజలు – సిరిసంపదలు" ఇందుకు ప్రథమ ప్రయత్నం అనుటలో సందేహంలేదు.

రాయల్ సైజులో 190 పేజీలతో, 19 అధ్యాయాలతో, ఆంధ్రదేశ జనాభా – ప్రజలు, వారివృత్తులు – వ్యవసాయం – ఆహార పంటలు– ఆహారేతర పంటలు – నదులు – ప్రాజెక్టులు – పసుసంపద – అడవులు – ఖనిజసంపద – పరిశ్రమలు – గ్రామీణ పరిశ్రమలు – విద్యుచ్ఛక్తి – వాణిజ్య వ్యాపారాలు – రవాణాలు – విద్య – ఆరోగ్యం – కొండజాతులు – ఆంధ్ర ప్రజల జీవన పరిస్థితులు మున్నగు శీర్షికలక్రింద, ఆంధ్రరాష్ట్రాన్ని గూర్చిన సమగ్ర సమాచారం ఇవ్వబడింది 25 పెద్ద పట్టికలు (స్టాటిస్టికల్ టేబుల్సు), 12 వివిధ మ్యాపులు ఇవ్వబడ్డాయి.

అమూల్యమైన సమాచారాన్ని, అధికారయుతమైన అంకెలతో, ఆంధ్రప్రజలకు అందిస్తున్నాము. వెల 3-12-0

ప్రతులకు

విశాలాంధ్ర ప్రచురణాలయం
బకింగ్‌హాంపేట పోస్టు విజయవాడ.2

విద్యామంత్రికి వరద బాధిత విద్యార్థుల మెమొరాండం

రాజమండ్రి, సెప్టెంబరు 25

వరదబాధితులైన విద్యార్థులతరఫున రాష్ట్రవిద్యార్థి ఫెడరేషన్ ఉపాధ్యక్షులు శ్రీ ఎ. వీరాస్వామిరాజా రిలీఫ్ కమిటీ కన్వీనరు శ్రీ పాపోలు ఆరవాలరావు, పట్టణ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు శ్రీ జంపన సత్యనారాయణ, ఆర్ట్సు కాలేజీ విద్యార్థి శ్రీ టి తిరపతయ్యచౌదరి, అమలాపురం కళాశాలవిద్యార్థి శ్రీ అంగాని శ్రీరామచంద్రవర్మగార్లు రాజమండ్రి హైస్కూలు విద్యార్థులు శ్రీ ఓలేటి కృపారావు, శ్రీ కొండేటి రామచంద్రరావు, రామదాసుగార్లు విద్యాశాఖా మంత్రి శ్రీ ఎస్. వి. కృష్ణరావుగారిని కలుసుకొని కనీసకోర్కెలపై మెమొరాండం సమర్పించారు.

మంత్రిగారు సమాధానం యిస్తూ, ప్రభుత్వం వరద నష్టాలకు గురైనవిద్యాలయాలకు కొంత సహాయం చేసినదని, ఇంతవరకు పూర్తిగా తెరువబడని విద్యాలయాలను తెరిచేటట్లు చేస్తామని అన్నారు. వరదబాధితులైన వారిలో పేదవిద్యార్థులకు మూడుమాసాల జీతాలు రద్దు చేశామని, ఇక రెండురోజులలో ఉత్తరువులురాగలవని అన్నారు. పాఠ్యపుస్తకాలు మొదలైన విషయాలు గురించి తగు లెక్కలు సేకరించిన పిమ్మట విద్యాలయాధికారులద్వారా తగు సహాయము చేస్తామని అన్నారు. ట్రైనింగ్ విద్యార్థులకు స్టయిఫండులు త్వరగా వచ్చేటట్లు చేస్తామని అన్నారు.

రిలీఫ్ కమిటీ ఆధ్వర్యాన 300మంది విద్యార్థులు ఊరేగింపుగా వెళ్లి యీ మెమొరాండం సమర్పించారు.

40 లక్షలు వ్యయపెట్టిన అరకులోయసాగు విఫలం

స్థానికప్రజావసరాలు దృష్టిలోలేని కారణంగా

["విశాలాంధ్ర" విలేఖరి]

విశాఖపట్నం సెప్టెంబరు 25

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో మిలిటరీకి కాయగూరలు సరఫరా చేసే నిమిత్తం అరకులోయ సాగుకు తేబడింది, కాని యుద్ధానంతరంకూడా మన్య ప్రాంతాల సముద్ధరణ పేరుతో ప్రభుత్వం 40 లక్షలు వ్యయపెట్టి యీ లోయ సాగు కొనసాగిస్తూ వచ్చింది. దీనివల్ల కొందరు ఉద్యోగులు పోషించబడడం జరిగిందేకాని మన్యం ప్రాంతాల అభివృద్ధికి అది తోడ్పడలేదు.

యుద్ధ సమయంలో విశాఖపట్టణాన గల మిల్టరీవారికై కాయగూరలు పండించి సప్లయి చేసేందుకు అరకు లోయను సాగుకు తీసుకు వచ్చారు. నిర్ణయించిన రీతినే యుద్ధ కాలంలో లోయలోపండిన పంటను మిల్టరీవారికి సప్లయి చేశారు. యుద్ధంముగియగానే 1946 వ సం॥లో సాగును ఆపివేయవలసివచ్చింది. కాని శ్రీ కోటిరామమూర్తిగారి ప్రోత్సాహం వల్ల, మన్యప్రాంతాల సముద్ధరణకని ఒక కొత్త పథకం వేసి ప్రభుత్వం, వ్యవసాయ పద్ధతులపై పరిశోధన ప్రచారం చేయ సంకల్పించింది. అప్పటినుండి మరలా లోయ సాగులోనికి తీసుకరాబడింది. సుమారు ఈ ఎనిమిది సంవత్సరాలకు ప్రభుత్వం, ఈలోయపై 40 లక్షల రూ॥ లు ఖర్చు చేసింది.

అయితే దీనివల్ల వచ్చిన ఫలితాలు మాత్రం అసంతృప్తికరమేనని చెప్పవచ్చును. కారణాలేవనగా లోయలోచేస్తున్న పరిశోధనలపైగాని, అక్కడ పండించే పంటలపైగాని కొండజాతులవారు, దగ్గరగానున్న పట్టణాల వారుగాని ఆశక్తి ప్రదర్శించాలి. కాయగూరలకు, పూల విత్తనాలకు తగిన మార్కెటు ఉండాలి. కాని యీ ఎనిమిది సంవత్సరాల అనుభవంలోను యివి అసంభవాలుగానే కనపడుతున్నాయి.

అయితే ప్రజల సహకారాన్ని లోయ పొందలేనందుకు కూడా తగిన బలవత్తర కారణాలున్నాయి. మొదటిది; రిజర్వు ఫారెస్టు పద్ధతులతో అసంతృప్తి చెందిన కొండజాతులవారు లోయలో జరుగుతున్న పరిశోధనలను, ప్రచారాన్ని నాగరికులు తమపై చేసే జులుంలో మరోవిధానమని, భాగమని భావించ మొదలు పెట్టారు. దీనికి కారణం ఉద్యోగులు తమకుగల అవకాశాలను అధికారాలను దుర్వినియోగపరచటం గాని, స్వప్రయోజనాలకై ఉపయోగించుకోవడం గాని చేస్తుండడంవలన ఈ కొండజాతులకు వీరిపై నమ్మకం సడలింది.

రెండవది లోయలో పండించిన పండ్లను, కాయకూరలను, విత్తనాలను పట్టణాలకు ఎగుమతిచేసి అమ్మేందుకుతగిన రవాణా సౌకర్యాలు లేవు వున్న కొద్ది రవాణా సౌకర్యాలకు అత్యధికంగా డబ్బు ఖర్చు చేయాల్సి వుంటోంది. ఇదిగాక లోయకు దగ్గరలో (70 మైళ్ళ దూరంలో) గల పట్టణంవిశాఖమాత్రమే! ఈదూరంలో రమారమి 35 మైళ్ళ వరకు ఘాట్ మైనుండి రావాలి. ఇంత వ్యయ ప్రయాసలకు లోనై తెచ్చినవాటికి మార్కెట్లో పోటీ ఎదురౌతుంది. మధ్యతరగతి సామాన్య ప్రజల అందుబాటులకు దూరమౌతుంది.

ఇన్నిబృహత్కారణాల తీవ్రతచే ఈ పథకంపై యిన్ని సంవత్సరాలుగ చేసిన ఖర్చు వృధాపోయింది ప్రజలకు సహకరించలేకపోయింది ముఖ్యంగా మన్య ప్రాంతీయులను సముద్ధరించలేకపోయింది. ఈకారణాలనుగ్రహించే జిల్లాఅధికారులుగూడ లోయపై ఖర్చును తగ్గించివేసారు. కాని యింతవరకు డబ్బు వృధా పర్చిన తర్వాత దీనిని మూసివేయుడం భావ్యం గాదని క్రొత్త పరిశోధనలకు ప్రోత్సహిస్తున్నారు. దీనికై ప్రత్యేక వ్యవసాయ శాఖాధికారినిగూడ నియమించడం జరిగింది. ఇప్పుడిప్పుడు పట్టుపురుగులను పెంచి పట్టు పరిశ్రమ నభివృద్ధి చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది మొత్తంపై ఈ ఎనిమిది సంవత్సరాలలో అరకు లోయలో జరిగినది. మన్యప్రాంతాల అభివృద్ధిగాక కొందరు ఉద్యోగస్థుల పోషణమాత్రమేనని తలంచబడుతోంది.

(వి. వి.)

వరద ప్రాంతాలకు ప్రపంచ విద్యార్థిసమాఖ్యసాయం

25 వేల రూపాయల మందులు విడుదల చేయడానికై ప్రభుత్వం అంగీకారం

ఆంధ్ర విద్యార్థుల ఆందోళనకు విజయం

రాజమండ్రి, సెప్టెంబరు 26

ప్రపంచ విద్యార్థి సమాఖ్య పంపిన మందులను ప్రభుత్వము గోదావరి వరదబాధిత ప్రాంతాలలో ఉపయోగించేందుకై రామకృష్ణ మిషన్‌వారికి స్వాధీనపరుస్తామని తెలియబరచింది. ఆంధ్రవిద్యార్థిలోకం ఈ విషయంలో ఒక విజయాన్ని సాధించింది.

ప్రపంచ విద్యార్థి సమాఖ్యవారు ఏడాదిక్రితం రాయలసీమకరువుప్రాంతాలలో వినియోగించేటందుకై పంపిన 25 వేల రూపాయల మందులను వరద ప్రాంతాలలోనైనా వినియోగించవలసిందనే ఆందోళన విజయం పొందింది. వానిని గోదావరి వరద బాధితప్రాంతాలలో ఉపయోగించేటందుకై రామకృష్ణమిషన్ వారికి పంపడానికై అంగీకరించింది. వీనిని పంచడంలో ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధుల సలహా, సహాయాలను తీసుకొనడానికై రాజమండ్రి రామకృష్ణ మిషన్ అధిపతి శ్రీ నిత్యబోధానందులు సమ్మతించారు.

ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్‌వారి కోరికపై ప్రపంచ విద్యార్థి సమాఖ్యవారు ఏడాదిక్రితం 25 వేల రూపాయలు ఖరీదుచేసే మందులను రాయలసీమ కరువు ప్రాంతాలలో వినియోగించేటందుకై పంపించారు. కాని భారత ప్రభుత్వం ఆ మందులపై 4 వేల రూపాయలు సుంకంవిధించి గోడవునులోపెట్టి ప్రజలకందకుండా చేసింది.

ఆనాటినుంచీ విద్యార్థి ఫెడరేషన్ వారు ఆ మందులపై సుంకం రద్దుపరచి కరువు పీడితులకుపయోగించనివ్వాలని ఆందోళన చేస్తూనే వున్నారు.

కాని, గోదావరి వరద ప్రమాదం వచ్చాక, ఈ ఆందోళనకు ప్రజాందోళన కూడా తోడయింది. రాజమండ్రి పౌరసభలో ఆ మందులను విడుదల చేయాలనే తీర్మానం చేశారు.

చివరకు ప్రజాందోళనకు తలవొగ్గి ప్రభుత్వం సుంకం తానే చెల్లించి, వానినిరామకృష్ణమిషన్ వారికి పంపడానికిఅంగీకరించింది.

ఉపాధ్యాయులకు ప్రత్యేక రిలీఫు కమిటీ

తూ. గో. జిల్లా ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి ప్రకటన

రాజమండ్రి, సెప్టెంబరు 25

తూర్పుగోదావరిజిల్లా ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ యం. నరసింహస్వామిగారిలా ప్రకటిస్తున్నారు:

"ఈనెల 19, 20 తేదీలలో జిల్లా కార్యవర్గం సమావేశమై వరదబాధితోపాధ్యాయుల స్థితిగతులను పరిశీలించి సహాయమొసగుటకు ఒక సబ్‌కమిటీని నియమించుట జరిగింది. ఆ నిర్ణయానుసారం నేను, కె. రామదాసు కలిసి కొన్ని గ్రామాలు సంచారం చేశాము. ప్రజలందరితోపాటు ప్రాథమికోపాధ్యాయులు కష్టములకు గురిఅయ్యారు. దాతలు తమ సహాకారాలను రిలీఫ్‌కమిటీలకు పంపించారు. ఆ యా కమిటీలు ప్రజలకు ఆ సహాయాన్ని పంచడం జరుగుతోంది.

కాని ఈ పంపకములో ప్రజలందరితో పాటు మధ్యతరగతికి చెందిన ఉపాధ్యాయుడు ముందుకువచ్చి ఆ సహాయాన్ని పొందలేకుండా యున్నాడు. ఈనాటివరకు కొన్ని ప్రాంతాలలో పాఠశాలలు తెరువక, తెరచినను బాలబాలికలకుపుస్తకములు, పలకలు వస్త్రాలు లేక, ఉపాధ్యాయులకు నివసించుటకు ఇల్లుగాని, జీవితావసర పరికరములుగాని లేక అల్లాడుచున్నారు. ఈ స్థితిలో రిలీఫు కమిటీలు ఉపాధ్యాయ సంస్థలద్వారా సేకరించిన వివరాలను తీసుకొని వారి నాదరిస్తారని ఆశిస్తున్నాము.

ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, ఇతర దాతలు విరాళములను శ్రీ కె. రామదాసు, జిల్లా ఉపాధ్యాయ రిలీఫు కమిటీ, కేరాఫ్ సిటీ వరద బాధిత రిలీఫు కమిటీ, టౌను హాలు, రాజమండ్రి ఎడ్రసుకు పంపగోర్తాము. బాధితులైన ఉపాధ్యాయులు వెనువెంటనే తమకు కలిగిన నష్టాలను ఈ దిగువ వివరాలతో పంపగోర్తాము

"పేరు, స్కూలు, చిరునామా, నష్ట వివరాలు, బడిపిల్లలకు కలిగిన నష్టములు."

శ్రీ పిల్లి గంగయ్యశెట్టిని విడుదల చేయాలి

శాసనసభ్యులు శ్రీ గంజి నాగేశ్వరరావుగారి అభ్యర్థన

కడలి, సెప్టెంబరు 24

తూర్పు గోదావరి జిల్లా విశ్వేశ్వరాయపురం కేసులో యావజ్జీవ శిక్ష విధించబడిన పిల్లి గంగయ్యశెట్టిగారు ఆరోగ్యం కోల్పోయినస్థితిలో ఉన్నారనీ, ఆంధ్రరాష్ట్రావతరణోత్సవ శుభ సమయంలో ఆయనను విడుదల చేయాలని కోరుతూ రాజోలు తాలూకా శాసనసభ్యులు శ్రీ గంజి నాగేశ్వరరావుగారు మద్రాసు హోంశాఖా కార్యదర్శికి వ్రాశారు.

చదవండి

జమ్మూలో

ప్రజాపరిషత్తు ఉద్యమం
దాని నిజస్వరూపం

వెల 0—2—0

గుడివాడమున్సిపల్ భవనం పేరు

పొట్టి శ్రీరాములుగారి పేర పెట్టుటకు కాంగ్రెసు కౌన్సిలర్ వ్యతిరేకత

గుడివాడ, సెప్టెంబరు 26

గుడివాడ మున్సిపల్ కౌన్సిల్ నిర్మించిన భవనానికి పొట్టి శ్రీరాములు బిల్డింగు అని పేరుపెట్టాలని కమ్యూనిస్టు కౌన్సిలర్ శ్రీ అట్లూరి సీతారామయ్యగారు 22 వ తేదీన జరిగిన రిక్విజిషన్ మీటింగులో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను కాంగ్రెసు కౌన్సిలరు శ్రీ మూడెడ్ల రామారావుగారు వ్యతిరేకించారు తీర్మానాన్ని బలపరచేవారెవరూ మాట్లాడకుండానే చైర్మన్ ఈ ప్రతిపాదనను తోసివేశారు.

చైర్మన్‌వర్గంవారు మినిట్సు పుస్తకము తీసుకొని వెళ్ళిపోయారు. తరువాత 13 మంది కౌన్సిలర్లు వేరే సమావేశం జరిపి చైర్మన్‌గారి అనుచిత నిర్ణయాన్ని నిరసించుతూ ప్రభుత్వం వెంటనే తగు చర్య తీసుకోవాలని తీర్మానించారు. (వి. వి)

జోనల్ పద్ధతికి స్వస్తి చెప్పాలి

నక్కపల్లి యువకుల డిమాండు

నక్కపల్లి, సెప్టెంబరు 27

విశాఖజిల్లా నక్కపల్లిగ్రామ యువకులు శ్రీ పచ్చిపులుసు వీరరాజుగారి అధ్యక్షతనయిటీవలసమావేశమైచర్చలు అనంతరం దిగువ తీర్మానాలు ఆమోదించారు.

— నూతనాంధ్ర రాష్ట్ర మహోత్సవ వేడుకలలో యువజనులందరు వుత్సాహంగా పాల్గొనాలనీ, ఈ శుభ సమయంలో జైళ్ళలో మగ్గుతూన్న రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలనీ, ఆంధ్రరాష్ట్రంలోని ధాన్యాలను తమిళ ప్రాంతాలకు తరలించుకు పోయే జోనల్ పద్ధతికి స్వస్తిచెప్పాలనీ కోరుతూ తీర్మానాలు చేశారు.

సంక్షిప్త వార్తలు

జక్కేపల్లి గూడూరు

కావలితాలూకా జక్కేపల్లిగూడూరు గ్రామ రైతుసంఘ సమావేశం ఈ నెల 19 వ తేదీన జరిగింది. యల్లనారాయణపురం వగైరా నాలుగు ఈనాం గ్రామాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఆంధ్రరాష్ట్ర దినోత్సవ సందర్భంలో రాజకీయ ఖైదీల నందరినీ విడుదల చేయాలని కోరుతూ తీర్మానించారు. మద్రాసు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యాప్రణాళిక పట్ల సమావేశం వారు తమ తీవ్ర నిరసన తెలియజేశారు.

రాజంపేట

రాజంపేట పట్టణ కమ్యూనిస్టు కమిటీ ఆధ్వర్యాన ఈనెల 18 వ తేదీ సాయంత్రం 4,000మందితో బహిరంగ సభ జరిగింది. శ్రీ నాతా కృష్ణమూర్తిగారు సభకు అధ్యక్షత వహించారు రాజంపేట పంచాయితీబోర్డు ప్రెసిడెంటు శ్రీ యం. సి. ఆంజనేయులుగారు ప్రసంగిస్తూ, పంచాయితీబోర్డు ప్రెసిడెంట్లకు,ప్రజలకు మధ్య ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు గుదిబండగా తయారవుతున్నారని సోదాహరణంగా వివరించారు మరికొందరు మాట్లాడిన తరువాత 'లప్పాంటుప్పా'అను నాటిక ప్రదర్శింపబడింది.

చిత్తూరు

చిత్తూరుజిల్లా టీచర్సుగిల్డుసమావేశం ఈనెల 27 వ తేదీన జరిగింది. చిత్తూరు కేంద్రంగా రాయలసీమ ఉపాధ్యాయ సమాఖ్యను స్థాపించే నిమిత్తం ఆరుగురితో ఒక ఉపసంఘం ఎన్నుకోబడింది. రాయలసీమకు ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయం నెలకొల్పేందుకు సత్వరచర్యలు గైకొనవలసిందిగా ఆంధ్రప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానం చేశారు.

సమష్టి కేంద్రాల ద్వారా చేనేతవారికి పని

కడపజిల్లా సంఘ కార్యవర్గం సూచన

ప్రొద్దటూరు, సెప్టెంబరు 26

ప్రతి చేనేత కేంద్రంలోను సమష్టికేంద్రాలు ఏర్పరచి చేనేతవారికి పని చూపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఇటీవల ఇచ్చట సమావేశమైన కడపజిల్లా చేనేత పారిశ్రామిక సంఘ కార్యవర్గ సమావేశంలో తీర్మానించబడింది.

సమావేశానికి శ్రీ అవ్వారు వెంకటసుబ్బయ్యగారు అధ్యక్షత వహించారు. కార్యదర్శి శ్రీ చేమూరు సుబ్బారావుగారు ప్రవేశపెట్టిన రిపోర్టు చదివి వినిపించబడింది. సహాయ కార్యదర్శి శ్రీ వడిశా నరసింహులుగారు చేనేత పరిశ్రమకు దాపురించిన దుస్థితిని వివరిస్తూ, ప్రభుత్వం తక్షణం తీసుకోవలసిన చర్యలను విశదీకరించారు. మరికొంత మంది సభ్యులు మాట్లాడిన తర్వాత ఈ దిగువ పేర్కొన్న తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడినవి.

తీర్మానాలు

చేనేత పరిశ్రమ రక్షణకై ఆంధ్ర రాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు అందజేసిన సూచనలను ఈ సమావేశం బలపరుస్తోంది. తక్షణమే వాటిని అమలు పరచవలసినదిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతోంది.

చేనేత పారిశ్రామికుల్లో నానాటికి నిరుద్యోగ తీవ్రత ఎక్కువవుతోంది. చేదామంటే ఏపనిదొరకక దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. వ్యవసాయంలోను, పరిశ్రమలలోను ఏర్పడిన సంక్షోభ ఫలితంగా వేలాది వ్యవసాయ కూలీలు తదితర కార్మికులు నిరుద్యోగులుగావుంటున్నారు. ఇక చేనేత వారికి అదనంగా పని ఎక్కడ లభిస్తుంది? కానప్రభుత్వం ప్రతి చేనేత కేంద్రంలోను 'కలెక్టివ్ సెంటర్లు' ఏర్పరచి చేనేత వారికి పని చూపించాలి. తక్షణ సహాయంగా నిరుద్యోగిగా వున్న ప్రతి చేనేత కార్మికునికి నిరుద్యోగ భృతి యివ్వాలని యీ సమావేశం ప్రభుత్వాన్ని పూర్తిగా డిమాండు చేస్తోంది. ఏ మాత్రం ఆలస్యమైనా పరిస్థితులు విషమించ గలవని హెచ్చరిస్తోంది.

జిల్లాలోని చేనేత కేంద్రాలలో ప్రాథమికంగా గంజి కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

చేనేతవారికి యిండ్లపన్ను తొలగించాలని జిల్లాలోని పంచాయితీబోర్డులను, మున్సిపాలిటీలను ఈ సమావేశం అర్థిస్తోంది

వరదబాధిత ప్రాంతాలలో ఈనాటి వరకు చేనేతవారికి ఏమాత్రం సహాయం అందజేయకుండా ఆలస్యము చేస్తున్న ప్రభుత్వచర్యపట్ల ఈ సమావేశం తీవ్ర నిరసన తెలియజేస్తోంది.

గురువర్యునిపై శిష్యుల అసంతృప్తి

ఉయ్యూరు, సెప్టెంబరు 28

ఉయ్యూరు పాలిటెక్నిక్ హాస్టలు వార్డెన్‌గా వుంటున్న ప్రిన్సిపాల్ వదరు హాస్టలు విద్యార్థులనుండి మొదట్లో వసూలుచేసిన డిపాజిట్టు మొత్తంతమకుసక్రమంగా అందడంలేదని విద్యార్థులు గట్టిగా ఆరోపిస్తున్నారు.

చదువు పూర్తి అయినతరువాత కొన్ని నెలలకుగాని ఆ డిపాజిట్టు మొత్తం విద్యార్థుల చేతికందడంలేదట ఒకవేళ ఏవిద్యార్థి అయినా అడిగితే ఇదిగో అదిగోనని వార్డన్ కాలహరణం చేయుడం, 'పాత్రల మరమ్మతు' అనే అదనపుఖర్చుక్రింద రు. 27 లు విరగ్గోసి ఏకొద్దిమందికో తక్కువడబ్బు ఇవ్వడం జరుగుతోందని అంటున్నారు.

ఇంజనీరింగ్ స్టూడెంట్సు అసోసియేషన్ అధ్యక్షుని హోదాలో ప్రిన్సిపాల్ ప్రతి విద్యార్థినుండి ఇంతవరకు వసూలు చేసిన సుమారు రు 5,000 ల మొత్తానికి లెక్కలు చూపలేదని విద్యార్థి వర్గాలద్వారా తెలుస్తున్నది. పైపెచ్చు, ఈ సంవత్సరం డబ్బు చాలదము లేదనే నెపంతో ప్రతి ఒక్కరి నుండి వసూలు చేసిన రు 10 లు గాక, ఆ ఉత్సవాల పేరిట తిరిగి పంద్రాండణాల [illegible] వసూలు చేస్తున్నటం వల్ల విద్యార్థులలో తీవ్ర అసంతృప్తి ప్రబలుతోంది

ఈ విషయమై [illegible] తక్షణం కల్పించుకొని, తమకు న్యాయం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. (వి వి.)

రేడియో

సెప్టెంబరు: 30 బుధవారం

విజయవాడ (357.1 మీటర్లలో) ఉదయము: 6-55 స్వాగతం 7-0; (తె. వా); 7-15 మద్రాసు వలె; 7-30 మద్రాసు వలె; 8-0 (ఆం. వా); మధ్యాహ్నం: 12-30 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు; 1-0 మద్రాసు వలె 1-30 మద్రాసు వలె; 1-40 (హిం. వా); 1-50 (తె. వా); 2-0 మద్రాసు వలె; 2-15 ఉన్నత పాఠశాల విద్యార్థులకు, 4-0 ప్రాథమికపాఠశాలా విద్యార్థులకు, సాయంత్రం: 5-30 నేతి శ్రీరామశర్మ, 5-50 ఎ. యజ్ఞనారాయణశాస్త్రి. వయొలిన్; 6-10 స్థానిక ప్రకటనలు, వాతావరణం; 6-15 సంగీత శిక్షణ; 6-30 గ్రామస్థుల కార్యక్రమము; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థుల కార్యక్రమము; 7-30 కల్పలత; 7-45 తెలుగునాడు జలవిద్యుత్ సంపద ప్రసంగము బెజవాడ గోపాలరెడ్డి; 8-0 భువనవిజయము నాటిక విశ్వనాథ సత్యనారాయణ; 8-30 ఆంగ్లప్రసంగం; 8-50 నేతి శ్రీరామశర్మ; 9-0 (ఆం. వా); 9-15 ఆంగ్లప్రసంగం; 9-30 సమాప్తి.

మద్రాసు (బి) (270.6 మీటర్లలో) ఉదయము: 6-55 స్వాగతము; 7-0 (తె. వా); 7-15 కమలా కృష్ణమూర్తి; 7-30 వీణ; మధ్యాహ్నం: 12-0 కార్మికుల కార్యక్రమము; 12-30 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు; 1-0 గీతమాలిక; 1-30 (ఆం. వా), 1-40 గీతమంజరి; 1-50 (తె. వా); 2-0 గోటువాయిద్యం; 2 15 ఉన్నత పాఠశాల విద్యార్థులకు; 4-0 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు; 4-30 పాశ్చాత్యసంగీతము; సాయంత్రం: 6-15 వయొలిన్; 6-30 గ్రామస్థుల కార్యక్రమము; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థుల కార్యక్రమము; 7-30 జంత్ర సమ్మేళనం; 7-45 రాష్ట్రావతరణ: ఆర్థికసంపద ప్రసంగము మామిడిపూడి వెంకటరంగయ్య, 8-0 విజయవాడవలె; 8-30 కె. ఆర్. లక్ష్మి; 9-0 (ఆం. వా); 9-30 వేణువు; 10-0 గానలహరి; 10-30 సమాప్తి.

హైద్రాబాద్ (411.0 మీటర్లలో) ఉదయము: 6-55 ప్రభాతగీతి; 7-0 (తె. వా); 7-15 జె నటరాజన్; 7-45 బాపూరావ్ జోషీ; 8-0 (ఆం. వా); 8-15 (హిం. వా); 8-30 మహేశ్వర రావ్; 8-45 అబ్దుల్ అజీజ్; 9 0 బాపూరావ్ జోషీ; మధ్యాహ్నం: 12-30 దాద్రా, ఘజల్, 12-50 (మ. వా); 1-0 గీత్; 1-10 గీతమాలిక; 1-30 ప్రేమాంజలి; 1-50 (తె. వా); సాయంత్రం: 5-30 ఆవో బచ్చో, 6-0 మహేశ్వరరావ్; 6-10 స్థానిక ప్రకటనలు; 6-15 సంస్కృత కార్యక్రమము; 6-30 అబ్దుల్ అజీజ్; 6-45 గ్రామసీమ; 7-0 (తె వా); 7-15 గ్రామసీమ; 7-45 (క. వా), 8-0 సంపాదకునికి లేఖలు; 8-15 జె నటరాజన్; 8 30 ఆంగ్ల ప్రసంగం; 8 50 ఆర్. జానకీదేవి; 9-0 (ఆం. వా); 9-15 (ఉ. వా); 9-30 వినోదకార్యక్రమము, 10-0 బాపూరావ్‌జోషీ, 10-15 సమాప్తి.

తరిగోపుల

కర్నూలుజిల్లా తంగెడంచ ఏరియా రైతు కార్యకర్తల సమావేశం ఈ నెల 21 వ తేదీన తరిగోపులలో జరిగింది. శ్రీ ఎ. శివరామయ్యగారు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆ రాత్రి జరిగిన బహిరంగ సభలో జిల్లారైతు సంఘ కార్యదర్శి శ్రీ యం. సుబ్బారెడ్డిగారు రైతుకూలీ సామరస్యం మున్నగు విషయాలను గురించి ప్రసంగించారు. ఆంధ్రలోని రాజకీయ ఖైదీలనందరిని విడుదల చేయాలి వగైరా తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడినవి.

అమెరికా - స్పెయిన్ ఒడంబడిక అంతరార్థం

మాస్కోరేడియో వ్యాఖ్య

పారిస్, సెప్టెంబరు 27

"అమెరికా యుద్ధోన్మాదులకు తమ పాత మిత్రులపై నమ్మకం తగ్గిపోయింది. తమ యుద్ధ వ్యూహాలను జయప్రదంగా కొనసాగించుకునేందుకు నమ్మకస్థుల యింకొత్త మిత్రులను సేకరించుకుంటున్నారు. మాడ్రిడ్‌లో జరిగిన అమెరికా స్పెయిన్ పరస్పర సైనిక సహాకార ఒడంబడిక అంతరార్థం ఇదే," అని మాస్కో రేడియో గత రాత్రి వ్యాఖ్యానించింది.

"ఇది బాహాటంగా చేసుకున్న ఒక యుద్ధ ఒడంబడికతప్ప మరొకటి కాదు" అన్నది.

పారిశ్రామిక తగాదా చట్టం జర్నలిస్టులకు వర్తింపు

దేశమంతటా పలుచోట్ల జరిగిన సభల్లో పత్రికా రచయితల డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27

పత్రికావృత్తే జీవనోపాధిగాగల పత్రికారచయితలందరినీ "కార్మికులు"గా పరిగణించి వారికికూడా పారిశ్రామిక తగాదాచట్టం వర్తించేటట్లు చేయవలసిందిగా డిమాండు చేస్తూ దేశంలోని వివిధ ప్రదేశాలలో జర్నలిస్టులు సభలు జరిపి తీర్మానాలు చేశారు.

ప్రముఖ పత్రికా రచయితలు సభల్లో ప్రసంగిస్తూ జర్నలిస్టుల పరిస్థితిని బాగుపరచాలని అర్థించారు.

రాజధానీనగరంలో జరిగిన సభలో దేశంలోని మూడు అఖిలభారత ట్రేడ్ యూనియన్ సంస్థలూ - అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు, జాతీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు, హింద్ మజుదూర్ సభ ప్రతినిధులు పత్రికా రచయితుల కోర్కెలను బలపరచుతూ మాట్లాడారు.

సభకు ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీ యస్. ఎ శాస్త్రి అధ్యక్షత వహించారు.

యూనియన్ సహాయ కార్యదర్శి మాట్లాడుతూ పారిశ్రామిక తగాదా చట్టం వర్తించేందుకు జర్నలిస్టులను కూడా కార్మికులుగా పరిగణించని పక్షంలో తమ జీవనపరిస్థితులను బాగుపరచుకోడానికి జర్నలిస్టులుచేసే కృషి అంతా వ్యర్థంకాగలదన్నారు.

భారత పత్రికా రచయితల ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి శ్రీ జె పి. చతుర్వేది మాట్లాడుతూ జర్నలిజం వొక వృత్తి అనీ అందువలన జర్నలిస్టులను "పనివారిగా" గుర్తించడానికి వీలులేదనీ యజమానులు తెస్తున్న వాదనలకు సమాధానం చెప్పారు.

ఆయనిలా అన్నారు:

"వారి వాదనలు విచిత్రంగా ఉన్నాయి. న్యాయవాద వృత్తికి చెందిన ఒక వ్యక్తి వేరే ప్రాక్టీసు పెట్టుకొని సంపాదించుకోవచ్చు. అలాగే వైద్య వృత్తిలో ఉన్నవారు వేరే ఆసుపత్రి పెట్టుకోవచ్చు. కాని జర్నలిస్టులు ఏదో ఒక పత్రికలో ఒక యజమాని క్రింద తప్పకుండా పనిచేసి తీరాలి అందువలన వీరికి కార్మికులతోపాటు హక్కులు లేకపోతే వారిపరిస్థితులు బాగుపడే అవకాశమే లేదు.

ట్రేడ్ యూనియన్ నాయకుల పూర్తి సహకారం

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రతినిధిగా శ్రీ పి రామమూర్తి సభలో మాట్లాడుతూ యిలా అన్నారు: చేతితో పనిచేసినా, మెదడుతో పనిచేసినా అంతా పనివారే తమ జీవనం కోసం పనిచేస్తున్న వారే అందువలన జర్నలిస్టులను కూడా కార్మికులను వలెనే పారిశ్రామిక తగాదాచట్టం వర్తించేటట్లు శాసనంలో తగు మార్పు చేయడం అవసరం. పత్రికా వృత్తే జీవనోపాధిగాగల జర్నలిస్టులంతా ఒక ఐక్యసంఘంలో సంఘటితపడి ఇలా తమ కోర్కెలకోసం పోరాడుతున్నందుకు చాల సంతోషపడుతున్నాం. కార్మికుల డిమాండ్లకోసం జరిగే ఐక్య పోరాటంలో రాజకీయ విభేదాలు అడ్డురాకూడదు.

అతరువాత నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తరఫున శ్రీ ఆర్ డి. జెయిన్, హింద్ మజుదూర్ సభ తరఫున మీర్ ముస్తాక్ మహమ్మద్ గార్లు ప్రసంగించారు.

మరికొంత మంది ప్రసంగించిన తరువాత జర్నలిస్టులను కార్మికులుగా పరిగణించి పారిశ్రామిక తగాదా చట్టం వర్తింప జేయాలన్న తీర్మానం ఆమోదించ బడింది.

కలకత్తాలో సభ

కలకత్తాలో భారత పత్రికా రచయితల ఫెడరేషన్ ఆదేశానుసారం జర్నలిస్టుల దినోత్సవం జరుపబడింది సాయంత్రం జరిగిన సభలో ప్రెస్‌ట్రస్ట్ అఫ్ ఇండియా ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ధీరేంద్రనాధ్ సెన్, పశ్చిమ బెంగాల్ హింద్‌మజుదూర్ సభా అధ్యక్షుడు శ్రీ జె ఎన్. మిత్రా బెంగాల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రతినిధి శ్రీహరికృష్ణబెనర్జీ, శ్రీ మృణాళ్ బోస్ మొదలుగాగల ప్రముఖులు జర్నలిస్టుల డిమాండ్లను బలపరుస్తూ ప్రసంగించారు.

ఇటీవలనే మూసివేయబడిన టైమ్స్ ఆఫ్ ఇండియా, నవభారతటైమ్స్, సత్యయుగ్‌లలో పని చేసిన జర్నలిస్టులు, కార్మికులు ఒక ఊరేగింపు జరిపారు.

భారతఫిల్ములదిగుమతిపై నిషేధంపాకిస్తాన్ పత్రికల కొక గొడ్డలిపెట్టు

లాహోర్, సెప్టెంబరు 27

ఇండియానుండి ఫిల్ముల దిగుమతిపై పాకిస్తాన్ ప్రభుత్వంవిధించిన నిషేధం, పాకిస్తాన్ థియేటర్లకే కాకుండా, పత్రికలకు కూడా ఒక గొడ్డలి పెట్టుగా పరిణమించిందని పాకిస్తాన్ పత్రికాధిపతుల సంఘ అధ్యక్షుడు మియాన్ మహ్మూద్ అహమద్ నేడు బయటపెట్టాడు.


Easy flowing...
Plato Vacumatic
Rs. 4/12 EACH
PLATO REGD.

"ప్లాటో వాక్యుమాటిక్"

2. బంగారముపూత [illegible] కట్టువున్న క్యాప్
* 'ప్లాటో ఇరిడియం' పాయింట్ గల [illegible]
* సీరా నింపటానికి [illegible]
* గ్యారంటీయైన [illegible]

ది [illegible] పెన్ డిపో,
ఆనందభవన్, ప్రిన్సెస్ స్ట్రీట్, [illegible]
మాత్రే పెన్ & ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బొంబాయి-4

"కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫు చేయాలి"

కేరళ ప్ర. సో. పార్టీ కార్యవర్గ డిమాండు

త్రివేండ్రం, సెప్టెంబరు 27

తిరువాన్కూర్ - కొచ్చిన్ రాష్ట్రములోని ప్రస్తుత మంత్రివర్గాన్ని బర్తరఫుచేసి, రాజ్యాంగంలో పొందుపరచబడిన సూత్రాల ననుసరించి పరిపాలనను సాగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రజా - సోషలిస్టు పార్టీ కార్యవర్గం ఒక తీర్మానం చేసింది.

నిన్న రాత్రి జరిగిన సమావేశంలో ఈ తీర్మానం చేస్తూ ప్రస్తుత మంత్రివర్గమే అధికారంలో తధాతధంగా కొనసాగడంపట్ల అసమ్మతిని తెలుపుతూ రాష్ట్రమంతటా ప్రదర్శనలు, సభలూ జరిపి తీర్మానాలు చేయాలని పార్టీ స్థానిక కమిటీలకు ఆదేశమివ్వబడింది.

కార్యవర్గం ఆమోదించిన తీర్మానంలో వెంటనే ఎన్నికలు జరిపేందుకు తగినపరిస్థితులు లేవని పేర్కొన్నది. నియోజక వర్గాల పునర్విభజన యింకా పూర్తికాలేదనీ, ఓటర్లజాబితా ఇంకా ప్రచురించ బడలేదనీ, వీటన్నిటినీ పూర్తిచేయడానికి తగినవ్యవధి వుండాలనీ, అలా కాకుండా హడావుడిగా జరిపితే ప్రజాస్వామ్యానికి దెబ్బతగులుతుందని తెలియజేశారు.

భాషల ప్రాతిపదికపైనే రాష్ట్రాల పునర్విభజన

భాషారాష్ట్రాల మహాసభ పునరుద్ఘాటన

కమిషన్ నియమించబడిన ఆరు మాసాలకే విభజన కార్యక్రమం ప్రారంభం కావాలని తీర్మానం

వల్లభవిద్యానగర్, సెప్టెంబరు 27

సరిహద్దుకమిషన్ నియమించబడిన ఆరుమాసాలకు భాషా ప్రాతిపదికపై దేశంలో రాష్ట్రాలను పునర్విభజించడానికి ఇండియా ప్రభుత్వం పూనుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత భాషా రాష్ట్రాల మహాసభ ఏకగ్రీవంగా ఈ వేళ సాయంత్ర ఒకతీర్మానం చేసింది.

డాక్టర్ లంక సుందరం అధ్యక్షతను రెండు రోజులుగా జరుగుతున్న మహాసభ నేటితో పూర్తి అయింది.

ఆంధ్రరాష్ట్రం అక్టోబరు ఒకటవ తేదీకి అవతరిస్తున్న సందర్భంలో

ఆంధ్రప్రజలకు హృదయపూర్వకమైన శుభాకాంక్షలను తెలియజేస్తూ మహాసభ మరొక తీర్మానంచేసింది.

తెలుగుప్రజల అంతిమ ఆశయమైన విశాలాంధ్ర సాధించబడేవరకూ కృషిని కొనసాగించవలసిందిగా ఆంధ్రప్రజలను తీర్మానం కోరింది.

ఆంధ్రరాష్ట్రంకోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములుకు, అఖిల భారత భాషా రాష్ట్రాల మహాసభకు అండదండగానిలబడి భాషారాష్ట్రాల ఉద్యమానికి తోడ్పడిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి మహాసభ తన జోహార్లను తెలుపుతూ ఇంకొక తీర్మానాన్ని ఆమోదించింది.

కమిటీ నియామకం

అఖిలభారత భాషారాష్ట్రాల కమిటీని 28 మంది సభ్యులతో మహాసభ ఏర్పరచింది. ఇందులో డాక్టర్ లంక సుందరం, శ్రీమతి సుచేత కృపలానీ, డాక్టర్ చందులాల్ దేశాయి (ప్రముఖ గుజరాత్ కాంగ్రెసు నాయకుడు) భారత కమ్యూనిస్టుపార్టీ తాత్కాలిక కార్యదర్శి ఇ యమ్ యస్. నంబూద్రిపాద్ మొదలుగా గలవారున్నారు.

భాషా రాష్ట్రాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ మహాసభచేసిన తీర్మానంలో యిలా ఉంది:

"రాష్ట్రాలను భాషా ప్రాతిపదికపై విభజించాలా లేదా అన్న విషయాన్ని గురించి నిర్ణయించడానికి ఉన్నతాధికారాలుగల కమీషన్ నియమించవలసిన పని లేదు. మొత్తం దేశంలోనే రాష్ట్రాలను భాషా ప్రయుక్తంగా విభజించాలన్న విషయం అందరూ అంగీకరించారు. ఇంక దీనిని గురించి పరిశీలించి చర్చించవలసిన పనిలేదు. ఎలాంటి ఆలస్యం చేయకుండా భాషారాష్ట్రాలను నిర్మించడమే నేడున్న కర్తవ్యం.

ఇండియా ప్రభుత్వం వెనువెంటనే సరిహద్దుకమిషన్ నియమించాలి. దాని నివేదిక కమిషన్ నియమించబడిన ఆరు మాసాల్లోపల పూర్తి కావాలి. ఇంక తర్వాత ఉమ్మడి ఆర్థికజీవనం, భౌగోళికంగాకలిసి వుండటాన్నీ మొదలుగాగల అంశాలను దృష్టిలోవుంచుకుని భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్విభజనకు పూనుకోవాలి"

పంజాబీ భాషా రాష్ట్ర ఆవశ్యకత

మరొక తీర్మానంలో హైదరాబాదు సంస్థాన్ని వెంటనే రద్దుచేసి అందులోని భాగాలను ఆయా భాషా ప్రాంతాలతో కలిపివేయాలని కోరారు. ఆ రాష్ట్రాలన్నింటినీ ఒకేసారి ఏర్పాటు చేయాలనికూడా తీర్మానంలో ఉదహరించారు.

ఉత్తర హిందూస్థానంలో పంజాబీ భాషా ప్రాంతాలలో పంజాబు రాష్ట్రాన్ని ఏర్పరచాలని కోరుతూ సర్దారు హుకుమ్‌సింగ్ ప్రతిపాదించిన తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

బీహారు రాష్ట్రంలోఉన్న బెంగాలీ ప్రాంతాలను బెంగాల్‌లో కలిపివేయాలని కోరుతూ మరొక తీర్మానం చేయబడింది.

భాషారాష్ట్రాల విషయమై కాంగ్రెసువాదులు మౌనం వహించాలని కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఇటీవల జారీచేసిన ఆదేశాన్ని మహాసభ నిరసించుతూ యిది పార్లమెంటులో డాక్టర్ కట్జూ ప్రసంగానికి విరుద్ధంగా వున్నదన్నారు భాషారాష్ట్రాల నిర్మాణం విషయం ఇంకేమాత్రం జాగుచేయరాదని ఆయన ఖచ్చితంగా చెప్పారు

భాషల ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్విభజించాలన్న ఈ ద్యమాన్ని గురించి ప్రజల్లో తీవ్రమైన ప్రచారం చేయాలని మహాసభ భాషారాష్ట్రవాదులను కోరింది.

మధ్యప్రాచ్యంలో అమెరికా కుట్రలు

చాల తీవ్రమయాయని 'ప్రవదా'

లండన్, సెప్టెంబరు 28

మధ్యప్రాచ్య దేశాల్లో అమెరికా రాయబారుల, గూఢచారుల, మిలిటరీ అధికారుల, కుట్రలూ కుహకాలూ ఇటీవల పెచ్చు పెరిగిపోయాయని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక 'ప్రవదా' నేడొక వ్యాసంలో బయటపెట్టింది.

ఆవ్యాసంలో ఇంకా ఇలా ఉంది.

"ఈ దేశాల నన్నిటినీ తన మిలిటరీ ఒడంబడికల ఉచ్చులో ఇరికించేందుకు అమెరికా ప్రభుత్వం, తన రాయబారుల ద్వారా, రకరకాల పన్నాగాలు పన్నుతూంది.

"సమిష్టి మధ్యప్రాచ్య సైన్య నిర్మాణం" అనే పథకాన్ని లోగడ సూచించారు. అరబ్బు దేశాలన్నీ తీవ్ర ప్రతిఘటన తెలిపేసరికి, చల్లగా దానిని వదులుకున్నారు. కొన్నాళ్ళు ఆగి, 'మధ్యప్రాచ్య సమిష్టి రక్షణ నిర్మాణం' అంటూ, అదే వ్యూహాన్ని కొత్త పేరుతో ప్రతిపాదించారు. ఈ ఎత్తు కూడా పారలేదు.

"ఇప్పుడు అమెరికావారు ఒక సరికొత్త పథకం తయారు చేశారు. దీని పేరును ఇంకా బయటపెట్టలేదు. కాని, పేరులో తప్ప దీనికీ వెనకటి వాటికీ వ్యత్యాసం ఏమీ ఉండదు."

ఆ దేశాల్లో అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు ఎంతటి ఘాతుకానికైనా ఒడిగట్టుతున్నారనీ, తిరుగుబాట్లు రెచ్చగొట్టడమూ, కుట్రలు చేయించడం, రాజకీయ నాయకులను హత్య చేయించడం,వీరికిసర్వసామాన్యమనీ తూర్పారబట్టింది.

మనసు మార్చుకున్న చైనా ఖైదీలు

65 మంది వప్పగింత

పాన్‌మున్‌జామ్, సెప్టెంబరు 27

మొదట మార్పిడికి నిరాకరించి, తరువాత తమ మనసు మార్చుకొన్న మరొక 65 మంది చైనాయుద్ధఖైదీలను భారత కాపుదల సేనాధికారులు నేడు ఉత్తరాదివారికి వప్పగించారు.

ఉత్తరకొరియా, చైనా అధికారులు వీరికి అత్యంత ప్రేమపూర్వకమైన స్వాగతం ఇచ్చారు.

మరి కొంతమందిని ఇంతకుముందే వప్పగించారు.

మార్పిడి ఒల్లని అమెరికన్ ఖైదీలకు, అమెరికన్ సేనానులను చూడడమే కంటకం

మార్పిడికి నిరాకరించిన ఐ. రా. స. పక్షపు ఖైదీల శిబిరంవద్దకు ఐ. రా. స. పక్షపు అధికారులు ఈవేళ వెళ్ళడం తటస్థించింది.

దానిలోని అమెరికన్ అధికారులను చూడగానే, ఖైదీలలోని అమెరికన్లు, దక్షిణకొరియావారు, ఆగ్రహం పట్టలేక "హాండి - హాండి" అని కేకలు వేస్తూ పెద్ద ప్రదర్శనం చేశారు. పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించబోయేసరికి, భారత సైనికులు ఐ. రా. స. అధికారులను త్వరగా అక్కడ నుండి తొలగించారు.

ఐ. రా. స. అధికారుల ఫిర్యాదు

నిస్సైనిక, తటస్థ ప్రాంతంలో మార్పిడికి నిరాకరించే ఉత్తరకొరియా, చైనా ఖైదీల శిబిరాలు దక్షిణభాగాన; అమెరికన్, బ్రిటిషు, దక్షిణ కొరియా ఖైదీలుండే శిబిరం ఉత్తరాన ఉన్నాయి. ఉత్తరభాగానవున్న శిబిరం వద్ద ఖైదీలకు నచ్చజెప్పేందుకు కల్పించబడిన వసతులు తృప్తికరంగా లేవని ఐ. రా. స. పక్షం తరఫున అమెరికన్ అధికారులు యుద్ధఖైదీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

దక్షిణ భాగానగల శిబిరాలవద్ద ఉత్తరాది అధికారులకు చాల చక్కని వసతులను తాము కలిగించామనీ, అదే స్థాయిలో ఉత్తరాన తమకు వసతులు కలిగించాలనీ వారన్నారు.

ఈ విషయం పరిశీలిస్తానని భారత సైనికాధికారి థోరట్ వాగ్దానం చేశాడు.

విజయవాడ - కర్నూలు ఎక్స్‌ప్రెస్

విజయవాడ, సెప్టెంబరు 28

విజయవాడ - కర్నూలు నగరాల మధ్య రేపటి నుంచి ప్రతిరోజూ ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తుంది ఈ రైలు గుంటూరు, నర్సరావుపేట,దొనకొండ, కంభం, దిగువమెట్ట, నంద్యాల స్టేషన్లలో మాత్రం నిలుస్తుంది. ద్రోణాచలం కర్నూలు దొను స్టేషన్‌లో మాత్రం అన్ని స్టేషన్లలో నిలుస్తుంది.

విజయవాడలో ఈ రైలు రాత్రికి 9 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి దినం ఉదయం 8.45 గంటలకు కర్నూలు చేరుతుంది. కర్నూలులో రైలు సాయంత్రం 6-10 కి బయలుదేరి, మరుసటినాడు ఉదయం 5-25 కు విజయవాడ చేరుతుంది. కలకత్తా మెయిల్ విజయవాడకు రెండు వైపుల నుంచి చేరే టైముకు అనుగుణ్యంగా ఈరైలు బయలుదేరే సమయమూ, వచ్చే సమయమూ నిర్ణయించబడ్డాయి.

కలరా ఫలితంగా మధ్యప్రదేశ్‌లో ఈసంవత్సరం 11,128 మంది చనిపోయారని అధికారరీత్యా ప్రకటించబడింది.

◆ ◆ ◆

ఆచార్య వినోబాభావేపై నియోఘర్‌లో [illegible] సందర్భంలో ఇప్పటివరకూ 24 మందిని అరెస్టుచేశారు.

ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్ష పదవి

సంజీవరెడ్డి రాజీనామా చేస్తారట

కర్నూలు, సెప్టెంబరు 27

ఆంధ్ర కాంగ్రెసు కమిటీ జనరల్ బాడీ సెప్టెంబరు 30 న ఇక్కడ సమావేశమైనప్పుడు శ్రీ సంజీవరెడ్డిగారు ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామాను ప్రకటిస్తారని తెలుస్తున్నది. ఆంధ్ర మంత్రివర్గంలో చేరుతున్నందున సంజీవరెడ్డిగారు ఈ పదవి తీసుకొనదలచారట

ఆంధ్ర అసెంబ్లీ కాంగ్రెసు పార్టీ సెప్టెంబరు 29 మధ్యాహ్నం ఇక్కడ సమావేశమవుతుంది. ఆంధ్ర మంత్రివర్గ నిర్మాణానికి సంబంధించిన తాజా పరిణామాలను సంజీవరెడ్డిగారు ఈ సమావేశంలో తెలియజేస్తారట.

ఆంధ్ర కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సెప్టెంబరు 03 ఉదయం, జనరల్ బాడీ ఆనాడు మధ్యాహ్నం సమావేశమవుతాయి. ఆంధ్ర రాజధానిగా కర్నూలు నిర్ణయాన్ని జనరల్ బాడీ చర్చిస్తుందట దీనిని ధృవపరచాలని సంజీవరెడ్డిగారు కోరుతారట.

ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కార్యాలయం నేడిక్కడ తెరవబడింది. ఇది తాత్కాలికకార్యాలయంగా వుంటుంది.

"రాజీనామా కోసం ప్రకాశంపై ఒత్తిడి"

కాంగ్రెసుపార్టీపై జయప్రకాశ్ విమర్శ

ముజఫరపూర్, సెప్టెంబరు 27

ప్రజాసోషలిస్టు పార్టీనుండి ప్రకాశంగారు రాజీనామా ఇచ్చినందుకు ఆ పార్టీ నాయకుడు జయప్రకాశ్ నారాయణ నేడు విచారం వెలిబుచ్చారు.

ప్రకాశంగారు పార్టీనుంచి రాజీనామా ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ ఒత్తిడి చేసినందుకు తాను విచారిస్తున్నానన్నారు.

"తమ సాంప్రదాయాలనే కాంగ్రెస్ అనుసరించకపోవడం ఆశ్చర్యకరం. రాజకీయ నీతినియమాలకంటే కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ, ప్రయోజనాలు ఎక్కువ ముఖ్యమని వారు భావించారు. ప్రకాశంగారిని రాజీనామా చేయుమని ఒత్తిడి చేయడంద్వారా, దేశంలో పార్టీ రాజకీయాలను కాంగ్రెస్ కలుషితంచేసింది" అని జయప్రకాశ్ అన్నారు.

సింహళ - చైనా వర్తక షరతులు

చైనా ప్రజాప్రభుత్వ ఔదార్యానికి నిదర్శనం

హాంకాంగ్, సెప్టెంబరు 27

సింహళ దేశంతో తన వర్తకాన్ని విస్తృతం చేసేందుకు చైనా ప్రభుత్వం అంగీకరించిందని, పెకింగ్ నుంచి ఇక్కడికి వచ్చిన సింహళ ప్రతినిధివర్గ నాయకుడు తెలిపాడు. చైనా ప్రభుత్వంతో సంప్రతింపులు ముగించి, సింహళానికి తిరిగిపోతూ, ఈ ప్రతినిధివర్గం ఇక్కడ ఆగింది.

సింహళం నుండి కొబ్బరికాయలను, ఇతర సరకులను విస్తారంగా కొనేందుకు చైనా ప్రభుత్వం అంగీకరించిందట.

సెప్టెంబరు 23 న చైనా - సింహళ ప్రభుత్వాలకు ఒక వర్తక ఒడంబడిక జరిగింది. సింహళదేశం నుండి రబ్బరు కొని, చైనా తన బియ్యాన్ని సింహళానికి అమ్ముతుంది.

సింహళం నుండి తాను కొనే రబ్బరుకు సింగపూర్ మార్కెటు రేటు కన్నా చాల ఎక్కువ ధరను చెల్లించేందుకూ ఇతర దేశాల ధరల కన్నా తక్కువధరకు తన బియ్యాన్ని సింహళ దేశానికి సప్లయి చేసేందుకూ చైనా, చాల ఉదారభావంతో నిశ్చయించిందని ప్రతినిధివర్గ నాయకుడు వివరించాడు.

ఫరూక్ ఆస్తి ఈజిప్ట్ ప్రభుత్వపరం

కైరో, సెప్టెంబరు 28

మాజీ ఈజిప్టు రాజు ఫరూక్ కి చెందిన కోట్లు విలువచేసే ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకునేందుకు ఈజిప్టు ప్రభుత్వం నిశ్చయించిందని, దేశీ వ్యవహారాలశాఖా మంత్రి మేజర్ సాలా సాలెమ్ నేడు ప్రకటించాడు.

మైసూర్ రాజప్రముఖ్ అక్టోబరు 1 న కర్నూలుకి వెళ్ళరని ముఖ్యమంత్రి హనుమంతయ్య గారు ప్రకటించారు.

బెంగాల్లో అరెస్టులు

(1 వ పేజీ తరువాయి)

దాడులు చేస్తున్నాయి వివిధవామపక్షాలకు చెందిన కార్యాలయాలపై కూడా దాడులు చేయబడ్డాయి

ప్రతిఘటన కమిటీకి ముఖ్యమంత్రి కబురు

ఈ వేళ ఉదయం 11 గంటలకు తనను కలుసు కోవలసిందిగా ప్రతిఘటనా కమిటీ నాయకులకు ముఖ్యమంత్రి డాక్టర్ బి. సి. రాయి కబురు చేశారు.

అరెస్టుచేయబడిన వారి నందరినీ విడుదలచేసి నిషేధాజ్ఞలను ఉపసంహరించు కొంటేగాని తాము కలవడానికి అవకాశం లేదని ప్రతిఘటన కమిటీ నాయకుడు శ్రీ హేమంతకుమార్ బోస్ ముఖ్యమంత్రికి తెలియ జేశారు.

నాలుగు రోజుల క్రితమే ముఖ్యమంత్రి డాక్టర్ రాయి పోలీసు అధికారులను సమావేశపరచి ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. కలకత్తాకు రాష్ట్రంలోని యితర ప్రాంతాల నుండి వచ్చే ఆకలియాత్రలను నగరం వెలుపలే ఈవేళ పోలీసులు ఆపివేస్తారాని తెలుస్తోంది.

జ్యోతీబాసుకోసం పోలీసుల గాలింపు

శాసనసభలో ప్రతిపక్ష నాయకుడైన జ్యోతిబాసుకోసం, కమల్ జతీన్ చక్రవర్తిగార్లకోసం పోలీసులు గాలిస్తున్నారు.

అరెస్టులు జరిగి నప్పటికీ నిర్ణయించిన కార్యక్రమాన్ని పూర్తిగా అమలు జరపడానికి విశ్వాసము ప్రతిఘటనా కమిటీ దృఢ నిశ్చయంతో ఉంది. 30 వ తేదీన రాష్ట్రమంతటా సార్వజనిక సమ్మె జరుగుతుంది.

కమ్యూనిస్టుపార్టీ నిరసన

ఈవేళ ఉదయం జరిగిన అరెస్టులపై పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు కమిటీ ఒకప్రకటన చేస్తూ నేడు రాష్ట్రంలో వున్న ఆహార సంక్షోభాన్ని పరిష్కరించడానికి అవసరమైన చర్యలను తీసుకునేందుకు బదులు ప్రభుత్వం అన్న మడుగుతున్న ప్రజలను అణచివేయడానికి పాత నిరంకుశ ధోరణిలోనే నిర్బంధవిధానాన్ని కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండించింది.

ఆ ప్రకటనలో యింకా యిలా ఉంది.

డాక్టర్ బి. సి. రాయి ప్రజల శక్తిని గురించి మరల పొరపాటు అంచనా వేసుకొన్నారు. అన్నార్తులైన ప్రజలపై సాగించుతున్న ఈ ప్రభుత్వ దాడికి ప్రజలు సరియైన సమాధానం చెప్పి తీరుతారు. నేడు రాష్ట్రంలో ఆహారపరిస్థితి చాల అధ్వాన్నస్థితిలోఉంది గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాదిప్రజలు తినడానికి తిండి లేక మలమల మాడిపోతున్న స్థితిలో వున్నారు. పట్టణాల్లోని పేదప్రజలు, నిరుద్యోగులు కూడా దుస్థితిలో ఉన్నారు. ఈ కఠోర సత్యాన్ని ప్రభుత్వం గుర్తించి నిర్బంధవిధానానికి స్వస్తి చెప్పి అన్నార్తులను ఆదుకోడానికి తక్షణం పూనుకోవాలి.

కమ్యూనిస్టు దేశాలతో పశ్చిమ దేశాల వర్తకం

అరికట్టడం అసాధ్యమని అమెరికా గుర్తింపు

వాషింగ్‌టన్, సెప్టెంబరు 28

బ్రిటన్ మొదలైన పాశ్చాత్య దేశాలు కొన్ని,చైనా మొదలైన కమ్యూనిస్టు దేశాలతో వర్తకం సాగిస్తున్నాయి కాబట్టి అమెరికా వాటికి సహాయం చేయ కూడదని సెనేటర్ మెకార్తీ చేసిన సూచనను తిరస్కరించేందుకు ఐసెన్‌హోవర్ నిశ్చయించాడు.

అమెరికా పరస్పర సహకార శాఖ మంత్రి హెరాల్డ్ స్టాసెన్ నేడు, శాసనసభకు ఒక వార్షిక నివేదికను సమర్పించే సందర్భంలో ఈ విషయాన్ని తెలియజేశాడు.

కమ్యూనిస్టు దేశాలతో పడమటి యూరోపు దేశాల వర్తకాన్ని పూర్తిగా అరికట్టడం అసాధ్యమనీ, సహాయం ఆపేస్తామని బెదరించి ఈ వర్తకాన్ని అమెరికా అరికట్ట గలుగుతుందని అనుకోవడం ప్రమాదకరమనీ, ఆ నివేదికలో అమెరికా ప్రభుత్వం గుర్తించింది. ఈ నివేదికను ఐసన్‌హోవర్ ఆమోదించాడు.

బ్రిటన్ మొదలైన దేశాలు కమ్యూనిస్టు దేశాలకు మిలిటరీ సరకులను అందచేస్తున్నవని మెకార్తీ, అతని కమిటీ చేస్తున్న ప్రచారాన్ని ఖండించింది.

తెలుగు క్రొత్తముఖములు తెలియు డైరెక్టరీ వెలువడుతోంది. ఉచితంగా ప్రతి సినిమాకు పంపబడుతుంది. మీ ఫోటో వివరాలు ప్రచురించుటకు స్థలంకోసం వ్రాయండి

అశోకా ఆర్ట్సు,
ఆత్కూరు, కృష్ణాజిల్లా.

నగరంలో సినిమాలు

29—9—53

శ్రీ లీలామహల్

Double Programme
FRENCHIE & BIG STORE
Two Days Only
3 Shows

శేష్ మహల్

సింద్‌బాద్ ది సైలర్
రంజన్, నశీమ్, భగవాన్
మూడు ఆటలు
On To Paradise
న్యూస్‌రీలు - గేవాకలర్‌లో

శ్రీదుర్గాకళామందిరం

పాతాళభైరవి
యన్. టి. రామారావు, మాలతి
9 వ వారం రెండు ఆటలు

శ్రీమారుతిసినిమా

చండీరాణి
భానుమతి, యన్. టి. రామారావు.
5 వ వారం మూడు ఆటలు
'కాశ్మీర్ సౌందర్య' పు ఒక రీలు గేవాకలర్‌లో చూపబడును.

శ్రీసరస్వతి

అవ్వయ్యార్
(తెలుగు కామెంటరీతో)
మూడు ఆటలు

బజారు ధరలు

విజయవాడ, సెప్టెంబరు 28
(మధ్యాహ్నం గం. 1-0)

బంగారం ధరలు

మేలిమి : పొట్టా	రు.	86- 4-0
నకరు		57- 8-0
మూసా		85- 4-0
వెండి : 100 తులములు		158- 0-0
1 తులము		1- 8-6

ధాన్యం ధరలు

24 నెంబరు	రు.	80- 0-0
బంకసన్నాలు		29- 0-0
12 నెంబరు		28- 0-0
అక్కుళ్ళు		27- 8-0
కుసుమ		26- 8-0
కొబాయశి		26- 8-0

బియ్యం ధరలు

24 నెంబరు	71- 0-0
బంకసన్నాలు	68- 0-0
12 నెంబరు	65- 0-0
అక్కుళ్ళు	65- 0-0
కుసుమ	64- 8-0
కొబాయశి	64- 8-0

అపరాల ధరలు

మినుములు 240 శే॥	రు.	57- 0-0
కందులు	రు.	40- 0-0
నల్లపెసలు 280 శే॥		45- 0-0
పచ్చపెసలు 230 శే॥		43- 0-0
పచ్చపెసలు (మెట్టవి)		41- 0.0
సెనగలు (దేశవాళీ)		53- 0-0
పంజాబు సెనగలు 205 శే		51- 0-0
ధనియాలు 90 శే॥		22- 0-0
ఉలవలు		44- 0-0
ఆముదాలు		41 8-0
పంచదార		95- 8-0
మిర్చి పుణుగు		86- 0-0
,, నాసి పుణుగు		19- 0-0
,, కేక్ 160 శే॥		20- 8-0
,, మద్దిపెండి 160 శే॥		24- 0-0
కొబ్బరికాయలు 1000		177-0-0
పాలకొల్లువి ,,		164 0 0
కొబ్బరినూనె డబ్బా		80-12-0
పసుపు ఘట్టి		229-0-0
సంచులు 100		87- 0-0

అక్టోబరు మూడవ తేదీన ప్రధాని నెహ్రూ మధుర వచ్చినప్పుడు ఆయన పర్యటనకు ప్రతికూలంగా నల్లజెండాల ప్రదర్శనం చేయడానికి స్థానిక ద్రవిడ కళగం నిర్ణయించింది.

సంపాదకులు, ముద్రాపకులు, ప్రచురణకర్త :— కాట్రగడ్డ రాజగోపాలరావు, ముద్రణ :— స్వతంత్ర పెన్ సర్వీస్ లిమిటెడ్ వారి స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు బకింగ్ హాం పేట, విజయవాడ సంపాదకవర్గం .— మోటూరు హనుమంతరావు [అధ్యక్షులు] [illegible], కాట్రగడ్డ రాజగోపాలరావు